బుధవారం
26-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 5
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కెన్యాలో నిరసనకారుల బీభత్సం

నైరోబీ: కెన్యా ప్రభుత్వం ప్రకటించిన కొత్త పన్నుకు వ్యతిరేకంగా ఆ దేశ రాజధాని నైరోబిలోని పార్లమెంట్‌లోకి ప్రవేశించి ఆందోళనకారులు బీభత్సం సృష్టించారు. పార్లమెంట్ భవనంలోని సామగ్రిని విరగ్గొట్టారు. కుర్చీలు, బల్లలు, తలుపులు, అద్దాలను పగలగొట్టారు. అక్కడితో శాంతించని నిరసనకారులు, విరగ్గొట్టిన కుర్చీలు, బల్లలను పోగేసి ఏకంగా పార్లమెంట్‌లోని ఓ విభాగానికి నిప్పంటించారు. అంతకుముందు పార్లమెంట్ భవనం ముట్టడికి ప్రయత్నించిన ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దాంతోపాటు జలఫిరంగులు, బాష్పవాయువు గోళాలను ప్రయోగించడం వల్ల పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇద్దరు కెన్యా పౌరులు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు.

వాయిదాలొద్దు

బెయిల్ పిటిషన్లపై సుప్రీం

న్యూఢిల్లీ: బెయిల్ అంశాలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వాటిని అనవసరంగా వాయిదా వేయకూడదని ఢిల్లీ హైకోర్టును ఉద్దేశిస్తూ పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ బెయిల్ విజ్ఞప్తిపై తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధించడం అసాధారణంగా పరిగణించిన సుప్రీం కోర్టు... మరో కేసులోనూ ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం తీరుపై ఇలా వ్యాఖ్యానించింది. తన బెయిల్ పిటిషన్ విచారించకుండా ఢిల్లీ హైకోర్టు సుదీర్ఘకాలం వాయిదా వేయడంపై మాజీమంత్రి సత్యేందర్ జైన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిని పరిశీలించిన జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీతో కూడిన ధర్మాసనం "బెయిల్ వ్యవహారాలను అనవసరంగా వాయిదా వేయకూడదని చెప్పనవసరం లేదు. అందుకే తదుపరి విచారణ తేదీన హైకోర్టు నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం' అని పేర్కొంది. జులై 9న హైకోర్టు విచారణ చేపట్టనుంది. మరోవైపు, అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధించి ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర నిలిపివేత ఉత్తర్వులు ఇవ్వటంపైనా

- మిగతా 2 లో

స్పీకర్ పదవికి పోటీ

- ప్రతిపక్షాల సంచలన నిర్ణయం
- ఓం బిర్లా వర్సెస్ సురేశ్
- స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి
- ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్... బీజేపీ ససేమిరా
- అభ్యర్థిని బరిలో నిలిపిన ఇండియా ఐక్య సంఘటన

న్యూఢిల్లీ: భారత దేశ రాజకీయాల్లో ఊహించని ఘటన! బీజేపీ ఏకపక్ష పోకడలతో ఇప్పటివరకు ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ వస్తున్న లోక్‌సభ స్పీకర్ పదవికి...స్వతంత్ర భారత దేశ చరిత్రలో తొలిసారి ఎన్నిక జరగనుంది. 18వ లోక్‌సభ స్పీకర్ పదవి కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ తరపున ఓం బిర్లా, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటన తరపున కే సురేశ్ పోటీపడనున్నారు. ఎన్డీఏ నుంచి రాజస్థాన్‌లోని కోటా నియోజకవర్గం నుంచి మూడోసారి ఎంపీగా ఎన్నికైన ఓం బిర్లా (బీజేపీ) నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా 10 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డా, బీజేపీ మిత్రపక్షాలు తెలుగుదేశం, జేడీయూ, జేడీఎస్, ఎల్‌జేపీ ఆయనకు మద్దతుగా నామినేషన్ సెట్లు దాఖలు చేశాయి. ఇక విపక్ష ఇండియా ఐక్య సంఘటన తరపున కేరళ నుంచి 8సార్లు ఎంపీగా ఎన్నికైన కె.సురేశ్ (కాంగ్రెస్) నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా మూడుసెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. వాస్తవానికి సభాపతి పదవిని అధికార పక్షం, ఉప సభాపతి పదవిని విపక్షం చేపట్టడం ఆనవాయితీగా వస్తుండగా... గత హయాంలో డిప్యూటీ స్పీకర్ లేకుండానే సభలు నడిచాయి. కాగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో దిగువ సభలో తమ బలాన్ని పెంచుకున్న ప్రతిపక్షాలు ఈసారి ఉప సభాపతి పదవికి పట్టుబట్టాయి. స్పీకర్ పదవి అధికార పక్షం తీసుకుంటే... డిప్యూటీ స్థానాన్ని తమకు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. లేదంటే సభాపతి పదవికి తాము అభ్యర్థిని నిలబెడతామని హెచ్చరించాయి. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను బీజేపీ చర్చలకు పురమాయించింది. ఈ ఉదయం నుంచి ఆయన మల్లికార్జున్ ఖర్గే, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ సహా ఇండియా కూటమి నేతలతో వరుస చర్చలు జరిపారు. స్పీకర్ పదవి ఏకగ్రీవమయ్యే సంప్రదాయాన్ని కొనసాగిద్దామని, అందుకు సహకరించాలని కోరారు. ఇందుకు ప్రతిపక్షాలు అంగీకరించినప్పటికీ.. ఉప సభాపతి పదవి కావాలన్న డిమాండ్ మళ్లీ ముందుంచాయి. దీనికి ఎన్డీయే సర్కారు సమ్మతించలేదు. దీంతో ప్రతిపక్షాలు పోటీకి దిగాయి. నామినేషన్ గడువు ముగియడానికి కేవలం కొన్ని నిమిషాల ముందు ఎన్డీయే, ఇండియా కూటమి అభ్యర్థులు తమ పత్రాలను సమర్పించారు. ఫలితంగా స్పీకర్ పదవికి ఎన్నిక అనివార్యమైంది. బుధవారం (జూన్ 26) ఈ ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా స్పీకర్ పదవికి ఎన్నిక అనివార్యం కావడంతో కాంగ్రెస్ పార్టీ తన ఎంపీలకు మూడు లైన్ల విప్ జారీ చేసింది.

చర్చలు విఫలం

అంతకుముందు స్పీకర్ ఎన్నిక అంశంపై నాటకీయ పరిణామాలు జరిగాయి. స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమయ్యేలా సహకరించాలని సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాజ్‌నాథ్ సింగ్ ఫోన్ చేయగా... అందుకు అంగీకరించిన ఖర్గే... సాంప్రదాయం ప్రకారం ఉపసభాపతి పదవిని ప్రతిపక్షాలకు ఇవ్వాలని కోరారు. ఆ విషయమై ఏకాభిప్రాయం కోసం పార్లమెంట్‌లోని సింగ్ కార్యాలయంలో ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, డీఎంకే నేత టీఆర్ బాలు, రాజ్‌నాథ్

- మిగతా 2 లో

ప్రతిపక్షంగా గుర్తించండి

అసెంబ్లీ స్పీకర్‌కు వైసీపీ అధినేత జగన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర శాసనసభలో వైసీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడికి మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. ఈనెల 21న అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని చూస్తే ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా నాకు ఇవ్వరనే అభిప్రాయం కలిగిందన్నారు. అసెంబ్లీ విధానం ప్రకారం ముందుగా సభా నాయకుడు, తర్వాత ప్రతిపక్ష నాయకుడు, ఆ తర్వాత మంత్రులు ప్రమాణస్వీకారం చేయాలి... కానీ అలా జరగలేదని గుర్తుచేశారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని జగన్ వివరించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని, పార్లమెంటులోకానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదని స్పష్టంచేశారు. అధికార కూటమి, మీరు... ఇప్పటికే నాపై శతృత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, అందుకు నిదర్శనంగా 'ఓడిపోయాడు కాని చావలేదు, చచ్చే వరకూ కొట్టాలి' అంటూ... మీరు మాట్లాడిన మాటలు వీడియోల ద్వారా బయటపడ్డాయని జగన్ గుర్తుచేశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటే ఎవరనే విషయాన్ని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారంటూ జగన్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్–1953 చట్టంలోని 12–బీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంటే ఎవరనే విషయాన్ని స్పష్టంగా

- మిగతా 2 లో

రాజ్యాంగ ప్రతి సాక్షిగా...

- రాహుల్ సహా విపక్ష ఎంపీల ప్రమాణం
- సభ్యుల నినాదాలు... అభ్యంతరాలు
- అఖిలేశ్, ఒవైసీ, హేమమాలిని, సుప్రియా సూలే ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ : లోక్‌సభ తొలి సమావేశాల రెండవ రోజు మంగళవారం కాంగ్రెస్ ఎంపీలు, అనేక మంది ప్రతిపక్ష సభ్యులు భారత రాజ్యాంగ ప్రతులను ప్రదర్శిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ నియామకం తీరుకు వ్యతిరేకంగా విపక్ష కూటమి పార్టీల ఎంపీలంతా రాజ్యాంగ ప్రతులతో సభలో నిరసన తెలుపుతున్నారు. అదేవిధంగా రాజ్యాంగ ప్రతులతోనే ప్రమాణ స్వీకారం

- మిగతా 2 లో

సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట

విశాలాంధ్ర –చిత్తూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు పేదరికం లేని సమాజాన్ని తీసుకురావాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గం కుప్పం లో పర్యటించారు. ఈ సందర్భంగా కుప్పం బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ... మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగానే పుడతానని, ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన కుప్పం ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని చెప్పారు. తన రాజకీయ జీవితంలో తొమ్మిది పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచానని, ఇందులో ఎనిమిది సార్లు కుప్పం వాసులే ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ఈ ఐదేళ్లలో కుప్పం

- వైసీపీ పాలన పీడకల
- కుప్పం అభివృద్ధికి ప్రత్యేక కృషి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజల రుణం తీర్చుకునేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించారని చెబుతూ... రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తిరగ రాయబోతున్నామని తెలిపారు. ఎన్నికల్లో కూడా యువత, మహిళలు, బలహీనవర్గాలకు అవకాశం ఇవ్వడం జరిగిందని... రాష్ట్ర

- మిగతా 2 లో

రాజధాని నిర్మాణానికి రూ. 4.5 కోట్ల విరాళం

విశాలాంధ్ర–కుప్పం : రెండు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం చిత్తూరు జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళల తరపున రూ.4.50 కోట్ల(చెక్కు) ను మహిళలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం పాల్గొన్న కుప్పం బహిరంగసభలో చిత్తూరు జిల్లాకు చెందిన గ్రామీణ పట్టణ స్వయం సహాయక సంఘాల నేతలు గాయత్రీ, సుకన్య మాట్లాడుతూ ఈ రోజు తాము ఇంత ఆనందంగా ఉన్నామంటే డ్వాక్రా మహిళల కోసం 25ఏళ్లకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు వేసిన విత్తనమే కారణమన్నారు. అది మహా వృక్షమై దాని కింద ఎన్నో లక్షల కుటుంబాలు శ్వాస తీసుకుంటున్నాయన్నారు. ఆ ఆనందాన్ని మీతో పంచుకుంటూ రాజధాని అమరావతి నిర్మాణం కోసం చిరు సాయంగా చిత్తూరు జిల్లాకు సంబంధించి గ్రామీణ పట్టణ స్వయం సహాయక సంఘాలకు చెందిన 4 లక్షల 30 వేల మంది మహిళల నుండి విరాళంగా సేకరించిన రూ. 4.5 కోట్ల రూపాయలు మెగా చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి కి అందజేశామని తెలిపారు. అదేవిదంగా అమరావతి నిర్మాణానికి రూ.5 లక్షల చెక్కు ను ఆనంద రెడ్డి, కిరణ్ కుమార్ అనే వారు లక్ష రూపాయల చెక్కు ను రాష్ట్ర ముఖ్యమంత్రి కి అందజేశారు.

'ఎర్రచందనం' జాడ ఇక

దేశ పటంలోనే!

- కనుమరుగవుతున్న అడవులు
- మోడువారుతున్న చెట్లు
- ప్రభుత్వాల ఉదాసీనత... చట్టాల్లో లోపాలు
- చెలరేగిపోతున్న స్మగ్లర్లు
- యథేచ్ఛగా ఎల్లలు దాటుతున్న దుంగలు
- 'పవన్' పవర్... సినిమా రీలా... రియలా...?

విశాలాంధ్ర–కడప: చట్టాలు ఎన్ని ఉన్నా... ప్రభుత్వాల ఉదాశీనత వల్ల అంతర్జాతీయ మార్కెట్లో కాసుల వర్షం కురిపించే అత్యంత విలువైన ఎర్రచందనం అడవులు నానాటికీ కనుమరుగౌతున్నాయి. స్మగ్లర్లు అడ్డంగా నరికేసి అడ్డదారుల్లో దుంగలను ఎల్లలు దాటిస్తున్నారు. ఇప్పటికే ఎర్రచందనం చెట్లు 80 శాతం మేరకు గొడ్డలి వేటుకు, రంపాల కోతకు గురై మోడువారుతున్నాయి. ప్రపంచ మార్కెట్లో టన్ను రూ.కోటికిపైగా పలికే ఎర్రచందనం అడవులు ప్రపంచ చిత్రపటంలో రాయలసీమకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఇంతటి విలువైన సంపదను ఎర్రదొంగలు యథేచ్ఛగా తరలిస్తూ అటవీ, పోలీస్ శాఖకు ఛాలెంజ్ విసురుతున్నారు. సీమ అడవుల్లో ఏపుగా పెరిగిన ఎర్రచందనం వృక్షాలు స్మగ్లర్ల ధాటికి నేలకొరుగుతున్నాయి. నాణ్యత లేదని సగం నరికి వదిలేస్తే అవి నిలువునా కూలిపోయి రక్త ధారలతో కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తమిళ కూలీల దాడితో ఎర్రచందనం అడవులు అలజడికి గురవుతున్నాయి. స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట

- మిగతా 2 లో

జైలు నుంచి అసాంజే విడుదల

2లో

ఇదీ లోకం!

ఇది సార్.. మన ఖజానా పరిస్థితి దీంతో పోలవరమే కడతారా? అమరావతే పూర్తి చేస్తారా? సూపర్ సిక్స్ కొడతారా!?

భారత్‌కు జలగండం

పెరుగుతున్న నీటి కొరత

- వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు నష్టం
- దేశ రుణ ఆరోగ్యానికి హానికరం
- సామాజిక అశాంతికి అవకాశం
- రేటింగ్ సంస్థ మూడీస్ వెల్లడి

న్యూఢిల్లీ: నీటి కొరత భారతదేశానికి ముప్పుగా మారనుందని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ మంగళవారం స్పష్టం చేసింది. పెరుగుతున్న నీటి కొరత వ్యవసాయ ఉత్పత్తి, పారిశ్రామిక కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తుందని, ఫలితంగా ఆహార ధరలలో ద్రవ్యోల్బణం ఫలితంగా ఆదాయంలో క్షీణత సామాజిక అశాంతికి దారితీయవచ్చని పేర్కొంది. ఇది దేశ రుణ ఆరోగ్యానికి హానికరమని తెలిపింది. దేశ వేగవంతమైన ఆర్థిక వృద్ధి, వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో పాటు ప్రపంచంలోని అత్యధిక జనాభా కలిగిన దేశంలో నీటి లభ్యత తగ్గుతుందని పేర్కొంది. అలాగే వాతావరణ మార్పుల కారణంగా నీటి ఒత్తిడి మరింత తీవ్రమవుతోంది, ఇది కరువులు, వేడి గాలులు, వరదలు వంటి తరచుగా తీవ్రమైన వాతావరణ సంఘటనలకు కారణమవుతుందని భారతదేశం ఎదుర్కొంటున్న పర్యావరణ ప్రమాదంపై మూడీస్ ఒక నివేదికలో వివరించింది. 'ఇది దేశ రుణ ఆరోగ్యానికి, అలాగే బొగ్గు విద్యుత్ జనరేటర్లు, ఉక్కు తయారీదారులు వంటి నీటిని ఎక్కువగా వినియోగించే రంగాలకు హానికరం. దీర్ఘకాలంలో నీటి నిర్వహణలో పెట్టుబడి నీటి కొరత నుంచి నష్టాలను తగ్గించగలదని' తెలిపింది. జాతీయ రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో నివాసితులు ఎదుర్కొంటున్న నీటి సంక్షోభం పెరుగుతున్న నేపథ్యంలో ఈ నివేదిక వచ్చింది. ఇది నిరసనలు, రాజకీయ సంఘర్షణకు దారితీసింది. ఈ అంశంపై జూన్ 21న నిరాహార దీక్ష ప్రారంభించిన ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి అతిశి ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం

- మిగతా 2 లో

జైలు నుంచి అసాంజే విడుదల

వాషింగ్టన్: గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే నేరం అంగీకరించారు. ఈ మేరకు అమెరికా న్యాయ విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కోర్టులో సమర్పించిన పత్రాలు వెల్లడించాయి. దీంతో కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు వీలుగా ఆయన్ను బ్రిటన్ జైలు నుంచి మంగళవారం ఉదయం విడుదల చేశారు. ఈ పరిణామంతో సుదీర్ఘంగా కొనసాగుతున్న రహస్య పత్రాల ప్రచురణ కేసు ఓ కొలిక్కి రానుంది. పశ్చిమ పసిఫిక్‌లోని యూఎస్ కామన్వెల్త్ మరియానా ఐలాండ్స్‌లోని ఫెడరల్ కోర్టులో అసాంజే హాజరుకానున్నట్లు పత్రాలు వెల్లడించాయి. గూఢచర్యం చట్టానికి విరుద్ధంగా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారం పొందడం, వ్యాప్తి చేయడం వంటి నేరారోపణలను అంగీకరించనున్నారని తెలిపాయి. దీన్ని న్యాయమూర్తి కచ్చితంగా ఆమోదించాల్సి ఉంటుంది. అదే జరిగితే ఏళ్లుగా కొనసాగుతున్న అమెరికా న్యాయపోరాటానికి ఓ పరిష్కారం లభిస్తుంది. అమెరికా సైన్యంలోని లోపాలను ఎత్తి చూపేందుకు ఆయన ఓ జర్నలిస్టులా వ్యవహరించారని ప్రపంచవ్యాప్తంగా అసాంజేకు అప్పట్లో ఓ వర్గం మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. అమెరికా మాత్రం చాలా సున్నితమైన సమాచారాన్ని చట్టవిరుద్ధంగా పొంది లీక్ చేశారని ఆరోపించింది. తద్వారా జాతీయ భద్రతను ప్రమాదంలో పడేశారని వాదించింది. నేరాంగీకారం, శిక్ష ఖరారు తర్వాత అసాంజే ఆస్ట్రేలియాకు చేరుకోనున్నారు. మరియానా ఐలాండ్స్‌లోని అతిపెద్ద ద్వీపమైన సైపన్‌లో అక్కడి కాలమానం ప్రకారం బుధవారం ఉదయం ఆయన కోర్టులో హాజరుకానున్నారు. అమెరికాకు రావడానికి ఆయన నిరాకరించడం వల్లే విచారణను అక్కడ చేపడుతున్నారు. పైగా అమెరికా అధీనంలో ఉండే ఆ భూభాగం ఆస్ట్రేలియాకు సమీపంలో ఉంటుంది. తాజా ఒప్పందంలో భాగంగా అసాంజే నేరాన్ని అంగీకరించటంతో పాటు అదనపు జైలు శిక్ష నుంచి ఆయనకు విముక్తి లభించాల్సి ఉంటుంది.

నెతన్యాహుతో ఇజ్రాయిల్‌కు ప్రమాదం

మాజీ గూఢచారి తీవ్ర విమర్శలు

టెల్అవీవ్: ముందుగా తమ దేశంపై హమాస్ జరిపిన దాడితో గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించింది. ప్రధానమంత్రి నెతన్యాహు పోరాటానికి కొందరు మద్దతుగా నిలుస్తుంటే మరికొందరు యుద్ధానికి వెంటనే ముగింపు పలికి బందీలను విడిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశం తరపున గూఢచర్యంలో పాల్గొన్న మాజీ అధికారి గొనెన్ బెన్ ఇట్జక్... నెతన్యాహు వైఖరిని తీవ్రంగా నిరసించారు. ఆయన ఇజ్రాయిల్‌కు అతిపెద్ద ప్రమాదకారి అని ఘాటుగా విమర్శించారు. 'నేను ఎంతోమంది ఉగ్రవాదుల్ని అరెస్టు చేశాను. ఉగ్రవాదం అంటే నాకు తెలుసు. కానీ నెతన్యాహు ఇజ్రాయిల్‌ను విధ్వంసంలోకి నెడుతున్నారని నాకు అనిపిస్తోంది. దేశానికి ఆయన అతిపెద్ద ముప్పుగా పరిణమించారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ మన దేశానికి అతిపెద్ద మద్దతుదారు. నెతన్యాహు మాత్రం ఆయనతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అగ్రదేశంతో మనకున్న సుదీర్ఘ బంధాన్ని నాశనం చేస్తున్నారు' అని మాజీ గూఢచారి నిరసన తెలిపారు. రఫాపై దాడికి సిద్ధపడొద్దని అమెరికా కొంతకాలంగా హెచ్చరికలు చేస్తోంది. అయినా ఇజ్రాయిల్ పెడచెవినపెడుతోంది. దీంతో ఆ దేశం నుంచి ఆయుధాల సరఫరా తగ్గిపోయిందని నెతన్యాహు ఇటీవల వెల్లడించారు. నాలుగు నెలల క్రితం నుంచి ఈ తగ్గుదల కనిపించిందని, కొన్నిరకాల ఆయుధాలను అమెరికా నిలిపివేసిందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గొనెన్ ప్రస్తావించారు. ఆయన దిగిపోవాలని అంతా కోరుకుంటున్నారని, అందుకు ఈ పరిస్థితే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఈ స్థాయి నిరసన వ్యక్తమవుతున్నా... పాక్షిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని తప్ప గాజాలో శాశ్వతంగా యుద్ధాన్ని నివారించే ఏ ఒడంబడికను తాము అంగీకరించబోమని నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే. హమాస్ అంతమయ్యేవరకు గాజాలో యుద్ధం ఆపే ప్రసక్తే లేదని అన్నారు. పాక్షిక ఒప్పందానికి మాత్రమే తాను సానుకూలమని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట

(మొదటిపేజీ తరువాయి)

మంత్రివర్గంలో ఎనిమిది మంది బీసీలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో కుప్పంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టేలా కృషి చేస్తానన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తం కావడంతోపాటు ఖజానా ఖాళీ అయిందని చంద్రబాబు తెలిపారు. అమరావతి, మద్యం పాలసీ, పోలవరం, భూగర్భ ఖనిజాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై శ్వేత పత్రాలు విడుదల చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఒకటో తేదీన నేరుగా లబ్ధిదారులకు అందివ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం పోలవరాన్ని, అమరావతిని సందర్శించడం జరిగిందని... ఇకనుంచి ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలన్న ఆశయంతో కుప్పం ప్రజలే నాకు ప్రత్యక్ష దేవుళ్లుగా భావించి ముందుగా ఇక్కడకు వచ్చానని చెప్పారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని విధాలుగా వెనకబడిపోయిందని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో పోలవరంతోపాటు పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాల్సి ఉందన్నారు. శ్రీశైలం నుంచి కుప్పానికి సాగనీరు అందించాలన్న సంకల్పంతో హంద్రీనీవా కాలువ పనులు గతంలో 90 శాతం పూర్తి చేస్తే ఐదేళ్ల వైసీపీ పాలనలో 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ విషయంలో కుప్పం వాసులను సినిమా సెట్టింగులతో వైసీపీ ప్రభుత్వం మోసగించే ప్రయత్నం చేసిందన్నారు. ఏడాదిలో హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీరు అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల హామీ మేరకు డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీ కి చర్యలు చేపట్టామన్నారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలనే దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఆకలి తీర్చడానికి 283 అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర సంక్షేమానికి ఎంత కష్టమైనా భరిస్తామన్నారు. కుప్పం ద్రావిడ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తామన్నారు. కుప్పం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు.

స్పీకర్ పదవికి పోటీ

(మొదటిపేజీ తరువాయి)

సింగ్‌తో భేటీ అయ్యారు. అయితే రెండు పక్షాల మధ్య సంక్షిప్త చర్చ వాగ్వాదంతో ముగిసింది. ప్రతిపక్షాలకు ఉప సభాపతి పదవి ఇచ్చేందుకు రాజ్‌నాథ్ హామీ ఇవ్వకపోవడంతో ఇండియా నేతలు వెనుదిరిగారు. ఆ తర్వాత కేంద్రమంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్‌లు విపక్షాలను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

ఖర్గేని అవమానించారు: రాహుల్

ప్రతిపక్షాలు ప్రభుత్వానికి నిర్మాణాత్మకంగా సహకరించాలని ప్రధాని మోదీ పేర్కొంటుండగా, అధికారపక్షం మాత్రం తమ పార్టీ అధ్యక్షుడు ఖర్గేని అవమానించిందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మండిపడ్డారు. స్పీకర్ ఎన్నిక విషయమై సహకరించాలని తమను కోరినట్లు చెప్పారు. అయితే సంప్రదాయం ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షానికి ఇవ్వాలని ఖర్గే అడిగినట్లు రాహుల్ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ అంశంపై అధికారపక్షం తన వైఖరి స్పష్టం చేయకుండానే స్పీకర్ ఎన్నికకు సహకరించాలని కోరటం విడ్డూరంగా ఉందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు.

కాంగ్రెస్ మమ్మల్ని సంప్రదించలేదు: టీఎంసీ

ఇండియా ఐక్య సంఘటన తరపున స్పీకర్ అభ్యర్థిగా కోడికున్నిల్ సురేశ్‌ను బరిలో నిలిపే విషయమై కాంగ్రెస్ పార్టీ తమను సంప్రదించలేదని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ పేర్కొన్నారు. సురేశ్‌కు మద్దతునిచ్చే విషయమై పార్టీ అధినేత్రి మమతాబెనర్జీ నిర్ణయం తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. స్పీకర్ ఎన్నిక కోసం సురేశ్ నామినేషన్ పత్రాలపై టీఎంసీ సంతకం చేయలేదని తెలిపారు. స్పీకర్ ఎన్నికలో అనుసరించాల్సి వ్యూహంపై మంగళవారం రాత్రి మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగే సమావేశానికి కూడా హాజరు కావడంలేదని తెలిపారు.

'ఇండియా' షరతులు విధించింది: గోయల్

మరోవైపు స్పీకర్ పదవి విషయమై ఇండియా కూటమి షరతులు విధించటం సరికాదని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. ఉప సభాపతి ఎన్నిక జరిగేటప్పుడు విపక్షాల డిమాండ్‌ను పరిశీలించేందుకు అంగీకరించినట్లు ఆయన చెప్పారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు పార్టీ రహితమన్నారు. ఇండియా కూటమి సంప్రదాయాలను పాటించట్లేదని గోయల్ ఆరోపించారు.

1946 తర్వాత మళ్లీ ఇప్పుడే...

స్వాతంత్ర్యానికి పూర్వం 1925 ఆగస్టు 24న అప్పటి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించారు. తర్వాత అదే పార్లమెంటుగా మారింది. ఆ ఎన్నికల్లో టి రంగాచారియార్‌పై స్వరాజ్య పార్టీ అభ్యర్థి విఠల్‌భాయ్ జె పటేల్ స్పీకర్‌గా నెగ్గారు. కేవలం రెండు ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1925 - 1946 మధ్య ఆరుసార్లు స్పీకర్ పదవికి ఎన్నికలు అవసరమయ్యాయి. చిట్టచివరిగా 1946లో ఎన్నికైన కాంగ్రెస్ నేత జీవీ మౌలాంకర్ ఆ తర్వాత తాత్కాలిక పార్లమెంటుకు కూడా స్పీకర్‌గా కొన్నాళ్లు కొనసాగారు. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ, రాజ్యసభలు ఏర్పాటయ్యాయి. 1956లో మౌలంకర్ మరణంతో ఉప సభాపతిగా ఉన్న అయ్యంగార్ స్పీకర్ అయ్యారు. ఆ తర్వాత 1957లో రెండో సాధారణ ఎన్నికల తర్వాత కూడా స్పీకర్‌గా నియమితులయ్యారు. ఆ విధంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకాభిప్రాయంతోనే జరుగుతూ వస్తోంది.

అమెరికాను ముంచెత్తిన వరదలు

వాషింగ్టన్: అమెరికాలో వరదలు తీవ్రమయ్యాయి. ఆ ప్రవాహ తీవ్రతకు ఓ డ్యామ్ బద్దలై జనావాసాల్లోకి నీరు చేరింది. అక్కడి ఐయోవా, సౌత్ డకోటా, మిన్నెసోటా, నెబ్రోస్కా రాష్ట్రాల్లో దాదాపు 30 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిన్నెసోటాలో బ్లూఎర్త్ కౌంటీలో ది ర్యాపిడాన్ డ్యామ్ వరద తీవ్రతకు బద్దలైంది. దీంతో సమీప ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనలో డ్యామ్ కొంత దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు. దక్షిణ మిన్నెసోటా ప్రాంతం ఇప్పటికీ వరదలోనే ఉంది. ఈ వారాంతంలో ఐయోవాలో వచ్చిన వరదల్లో ఓ వ్యక్తి కొట్టుకుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. దాదాపు 11 వేల మంది జీవించే స్పెన్సర్ నగరం, క్లే కౌంటీలకు ఇతర ప్రాంతాలతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. 383 మందిని వరద నుంచి కాపాడారు. సియోక్స్ నగరానికి చెందిన ఫైర్ మార్షల్ ఈ వరదను తాము ఊహించలేకపోయినట్లు వెల్లడించారు. ఇక్కడ ఒక రైల్‌రోడ్ వంతెన నీటి ప్రవాహం తీవ్రతకు కుప్పకూలిపోయింది. ఇది ఐయోవా నుంచి దక్షిణ డకోటాలోని ప్రాంతాలను కలుపుతుంది. 1993లో వచ్చిన భయానక వరదలను ప్రస్తుత పరిస్థితి గుర్తు చేస్తోందని ఐయోవా గవర్నర్ కిమ్ రేనాల్డ్స్ పేర్కొన్నారు. ఇక్కడ ప్రధాన వ్యాపారాలు మొత్తం మూతపడ్డాయని, ఆస్పత్రులను ఖాళీ చేయించినట్లు వెల్లడించారు. నీటి ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నీరు మొత్తం మిస్సోరీ, మిసిసిపీ నదిలోకి చేరనుంది. సియోక్స్ ప్రాంతంలో భారీ వర్షాలు కురిశాయి. ఇక్కడి విమానాశ్రయంలో భారీ వర్షపాతం నమోదైంది. ఇక ఐయోవాలోని రాక్ ర్యాపిడ్స్ ప్రాంతంలోనూ భారీగా వర్షపాతం నమోదైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఈ పరిస్థితి తలెత్తినట్లు జోసఫ్ అనే వాతావరణ నిపుణుడు పేర్కొన్నాడు. ఇప్పటికే నేల పూర్తిగా తేమతో నిండిపోవడంతో భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి ఏర్పడి వరదగా మారిందన్నారు.

రాజ్యాంగ ప్రతి సాక్షిగా...

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పోడియం వద్దకు వెళ్లి ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా కూటమి పార్టీల ఎంపీలంతా ఇదే విధానాన్ని అనుసరించారు. మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన ప్రముఖుల్లో రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్, మహువా మొయిత్రా, డింపుల్ యాదవ్, హేమ మాలిని, అసదుద్దీన్ ఒవైసీ, కనిమొళి కరుణానిధి తదితరులు ఉన్నారు. ఇక కొత్తగా ఎన్నికయిన సభ్యుల్లో కేంద్ర మంత్రి, బీజేపీ నేత నారాయణ్ రాణే, ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) కి చెందిన అరవింద్ సావంత్, శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే కూడా ఉన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, సూలే... ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ పాదాలను తాకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నుంచి కూడా ఆశీర్వాదాలు తీసుకున్నారు. సభ ప్రారంభంలో కొత్తగా ఎన్నికయిన 262 మంది సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారని, మిగిలిన వారు ఈరోజు ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రోటెం స్పీకర్ తెలిపారు. మొదటి గంటలో ఎక్కువ మంది సభ్యులు మహారాష్ట్రకు చెందినవారు. వీరు మరాఠీలో ప్రమాణం చేశారు. కొందరు ఇంగ్లీషు, హిందీలో ప్రమాణం చేశారు. మహారాష్ట్రలోని నందుర్బార్ కాంగ్రెస్ సభ్యుడు గోవాల్ కగడ పదవి మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన మొదటి ఎంపీ. ఆయన తర్వాత కాంగ్రెస్‌కు చెందిన ధూలే ఎంపీ శోభా దినేష్ బచావ్, జల్గావ్ నుంచి బీజేపీకి చెందిన స్మితా ఉదయ్ వాఘ్ ఉన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయిన వారిలో కేంద్ర మంత్రులు గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ జోషి, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, డీఎంకేకు చెందిన టీఆర్ బాలు, టీఎంసీకి చెందిన మహువా మొయిత్రా, శిరోమణి అకాలీదళ్‌కు చెందిన హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ ఉన్నారు. అనేక మంది ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జై హింద్, జై మహారాష్ట్ర, జై భీమ్, జై శివాజీ నినాదాలు చేశారు. స్పీకర్ పదవికి నామినేట్ అయిన బీజేపీ నేత ఓం బిర్లా కూడా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. 17వ లోక్‌సభలో స్పీకర్‌గా ఉన్న బిర్లా ప్రమాణ స్వీకారం చేసేందుకు వచ్చినప్పుడు కుర్చీలో ఉన్న రాధామోహన్ సింగ్ లేచి నిలబడి ఆయనకు అభివాదం చేశారు. బిర్లా 2014 నుంచి దిగువ సభలో కోట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, కనీసం ఒక్కసారైనా సభ్యులు నిర్దేశించిన ప్రమాణం నుంచి తప్పుకోవద్దని, వారు ఇచ్చిన కాగితంపై రాసిన వాటిని మాత్రమే బిగ్గరగా చదవాలని ప్రొటెం స్పీకర్ గుర్తు చేశారు. ఇదిలాఉండగా, అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణం చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత, రాయ్‌బరేలి ఎంపీ రాహుల్ గాంధీ కూడా ప్రమాణం చేసిన తర్వాత 'జై హింద్, జై సంవిధాన్' అన్నారు. ఇన్నర్ మణిపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజం మణిపురిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం గాంధీతో కరచాలనం చేశారు. ఔటర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ ఆల్ఫ్రెడ్ ఎస్ ఆర్థర్ పేరును ప్రమాణ స్వీకారానికి పిలిచినప్పుడు రాహుల్ గాంధీ లేచి నిలబడి ఆయనతో కరచాలనం చేశారు. ఆంగ్లంలో ప్రమాణం చేసిన తర్వాత ఆర్థర్, 'మణిపూర్ మే న్యాయ్ దిలాయే, దేశ్ బచాయియే' (మణిపూర్‌లో న్యాయం అందించండి. దేశాన్ని రక్షించండి' అని అన్నారు. కాంగ్రెస్ సభ్యుల 'మణిపూర్... మణిపూర్' నినాదాల మధ్యే ఈ ఇద్దరు ఎంపీల ప్రమాణ స్వీకారం జరిగింది. ఇక ఒడిశాకు చెందిన మెజారిటీ ఎంపీలు ఒడియాలో ప్రమాణ స్వీకారం చేశారు. మాళవికా దేవి, ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి మాత్రమే తమ ప్రమాణాలను ఇంగ్లీషులో చదివారు. పంజాబ్‌కు చెందిన ఎంపీలు పంజాబీలో ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్, ఆప్‌లకు చెందిన అనేక మంది రాజ్యాంగ ప్రతులను పట్టుకుని ప్రమాణం చేశారు. భోజన విరామం తర్వాత, తమిళనాడు ఎంపీలు తమ ప్రమాణ స్వీకారాన్ని పునః ప్రారంభించారు. డీఎంకే సభ్యులు తమిళాన్ని ఎంచుకుని రాజ్యాంగానికి విధేయత చూపుతామని ప్రతిజ్ఞ చేశారు.

రాజ్యాంగ ప్రతితో రాహుల్ గాంధీ ప్రమాణం

భారత్ జోడో నినాదాలు, చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం మధ్యాహ్నం లోక్‌సభ సభ్యునిగా ప్రమాణం చేశారు. గాంధీ వయనాడ్, రాయ్‌బరేలీ రెండు స్థానాల నుంచి ఎన్నికయ్యారు. ఇప్పుడు తన సోదరి, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేయనున్న వయనాడ్ సీటును ఆయన ఖాళీ చేశారు. 'నేను, రాహుల్ గాంధీ... ప్రజల సభకు సభ్యునిగా ఎన్నికైనందున చట్టం ద్వారా స్థాపించబడిన భారత రాజ్యాంగంపై నేను నిజమైన విశ్వాసం, విధేయతను కలిగి ఉంటానని, నేను భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను సమర్థిస్తానని గంభీరంగా ధ్రువీకరిస్తున్నాను. నేను ప్రవేశించబోతున్న కర్తవ్యాన్ని నిష్ఠతో నిర్వర్తిస్తాను. జై హింద్, జై సంవిధాన్' అని ప్రమాణ స్వీకారం చేశారు.

'జై పలస్తీనా'... 'జై హిందూ రాష్ట్ర' నినాదాలు

హైదరాబాద్‌కు చెందిన ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఉర్దూలో ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు ప్రార్థన కూడా చదివారు. తర్వాత సంఘర్షణతో దెబ్బతిన్న పశ్చిమాసియా ప్రాంతాన్ని ప్రస్తావించారు. 'జై పాలస్తీనా' అని అన్నారు. దీనిపై అధికార పక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇది రికార్డుల్లోకి వెళ్లదని ప్రొటెం స్పీకర్ మహతాబ హామీ ఇచ్చారు. తన ప్రమాణ స్వీకారం సందర్భంగా బరేలీకి చెందిన బీజేపీ ఎంపీ చత్రపాల్ సింగ్ గంగ్వార్ 'జై హిందూ రాష్ట్ర' అని చెప్పడంతో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రతిపక్ష ఎంపీ ప్రేమచంద్రన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, 'అతను ఎలా చెప్పగలడు?' అని ప్రశ్నించారు. ఇది రికార్డుల్లోకి వెళ్లదని సభాపతి హామీ ఇచ్చారు.

నేటికి లోక్‌సభ వాయిదా

లోక్‌సభ ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ మాట్లాడుతూ ఎంపీల ప్రమాణాలు, ధ్రువీకరణలు మాత్రమే నమోదవుతాయని, మిగిలిన అన్ని వ్యాఖ్యలు, నిరసనలు, నినాదాలు తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం సభా కార్యక్రమాలను బుధవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సహా కొత్తగా ఎన్నికయిన 262 మంది ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశాల సందర్భంగా మొదటి రోజు ఇండియా ఐక్య సంఘటనకు చెందిన విపక్ష ఎంపీలు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని నినాదాలు చేస్తూ, రాజ్యాంగ ప్రతులను ప్రదర్శిస్తూ పార్లమెంటు సముదాయం లోపల నిరసన ప్రదర్శన నిర్వహించారు.

భారత్‌కు జలగండం

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం ఆస్పత్రిలో చేరారు. 'నీటి సరఫరాలో తగ్గుదల వల్లవ్యవసాయోత్పత్తి, పారిశ్రామిక కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తుంది. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం, ప్రభావిత వ్యాపారాలు, వర్గాలకు ఆదాయం తగ్గుతుంది. అదే సమయంలో సామాజిక అశాంతికి దారి తీస్తుంది. ఇది భారతదేశ వృద్ధిలో అస్థిరతను పెంచుతుంది. ఇబ్బందులను తట్టుకునే ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది' అని మూడీస్ పేర్కొంది. నీటి వనరుల మంత్రిత్వ శాఖ గణాంకాలను ఉటంకిస్తూ, భారతదేశ సగటు వార్షిక తలసరి వార్షిక నీటి లభ్యత 2021లో ఇప్పటికే తక్కువగా ఉన్న 1,486 క్యూబిక్ మీటర్ల నుంచి 2031 నాటికి 1,367 క్యూబిక్ మీటర్లకు పడిపోవచ్చు. ఇది 1,700 క్యూబిక్ మీటర్ల కంటే తక్కువ స్థాయి నీటి ఎద్దడిని, 1,000 క్యూబిక్ మీటర్ల నీటి కొరతను సూచిస్తుంది. జూన్ 2024లో వడ గాడ్పులు, ఢిల్లీ, ఉత్తర భారత రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని మూడీస్ తెలిపింది. దేశంలోని అత్యంత సాధారణ ప్రకృతి వైపరీత్యాలలో ఒకటైన వరదలు, నీటి మౌలిక సదుపాయాలకు అంతరాయం కలిగిస్తాయి. ఇది ఆకస్మిక భారీ వర్షాల నుంచి నీటిని నిలుపుకోవడానికి సరిపోదు. 2023లో ఉత్తర భారతదేశంలోని వరదలు, అలాగే గుజరాత్‌లోని బిపర్జోయ్ తుఫాను కారణంగా 120 నుంచి 180 కోట్ల ఆర్థిక నష్టం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని భారతీయ స్టేట్ బ్యాంకు అంచనా వేసింది. రుతుపవనాల వర్షపాతం కూడా తగ్గుతోంది. 1950-2020 సమయంలో హిందూ మహాసముద్రం శతాబ్దానికి 1.2 డిగ్రీల సెల్సియస్ చొప్పున వేడెక్కింది. ఇది 2020-2100 మధ్యకాలంలో 1.7-3.8 డిగ్రీల సెల్సియస్‌కు పెరుగుతుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ తెలిపింది. వర్షపాతం తగ్గింది, కరువు మరింత తీవ్రంగా, తరచుగా మారింది. 2023లో భారతదేశంలో రుతుపవన వర్షపాతం 1971-2020 సగటు కంటే 6 శాతం తక్కువగా ఉంది. ఆ సంవత్సరం ఆగస్టులో దేశంలో అపూర్వమైన వర్షపాతం ఉంది. మూడీస్ నివేదిక ప్రకారం, దేశంలో 70 శాతానికి పైగా వర్షపాతం ప్రతి సంవత్సరం జూన్-సెప్టెంబరులో కేంద్రీకృతమై ఉంటుంది. గతంలో వ్యవసాయ ఉత్పత్తికి ఆటంకాలు, ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరుగుదల దేశ ఆర్థిక లోటుకు కారణమైన ఆహార సబ్సిడీల పెరుగుదలకు దారితీసింది. ఆహార సబ్సిడీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కేంద్ర ప్రభుత్వ వ్యయంలో 4.3 శాతం బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. ఇది బడ్జెట్‌లోని అతిపెద్ద అంశాలలో ఒకటి. భారత ప్రభుత్వం నీటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెడుతున్నదని, పునరుత్పాదక ఇంధన అభివృద్ధికి కృషి చేస్తోందని మూడీస్ తెలిపింది. అదే సమయంలో నీటికి సంబంధించి భారీ పారిశ్రామిక వినియోగదారులు తమ నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి చూస్తున్నారు. ఈ ప్రయత్నాలు దేశానికి, కంపెనీలకు దీర్ఘకాలికంగా నీటి నిర్వహణ ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొంది. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వ్యాపారాలు, నివాసితుల మధ్య నీటి కోసం తీవ్ర పోటీకి దారి తీస్తుందని వెల్లడించింది. ఫిబ్రవరి 2023 నాటి ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, గత దశాబ్దంలో గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీటిని తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు బహుపాక్షిక రుణదాత మద్దతు ఇచ్చినట్లు మూడీస్ తెలిపింది.

వాయిదాలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచడాన్ని 'అసాధారణ నిర్ణయం'గా అభిప్రాయపడింది. కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే ఇస్తూ హైకోర్టు నిర్ణయం వెలువడిన నేపథ్యంలో జూన్ 26న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

ప్రతిపక్షంగా గుర్తించండి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వచించారని తెలిపారు. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యాబలం ఉంటే వారికి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతోందన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికలకు ముందే పొత్తుపెట్టుకుని, సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైసీపీనేనని స్పష్టంచేశారు. ఈనెల 21న జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని చూస్తే... వైసీపీకి ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడంలోగాని, ఆపార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నాకు ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించడంలోగానీ, మీ ఉద్దేశాలేంటో బయటపడ్డాయని పేర్కొన్నారు. చట్టాన్ని బట్టి చూస్తే, వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడంలోగాని, ఆపార్టీ శాసనసభా పక్షనేత అయిన నన్ను ప్రధాన ప్రతిపక్షనేతగా మీరు గుర్తించడంలో ఎలాంటి సందిగ్ధతకు తావులేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ 40 శాతం ఓట్లను సాధించిందని, ప్రజా సంబంధిత అంశాలపై అసెంబ్లీలో ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల అసెంబ్లీలో ప్రతిక్ష నాయకుడికి తగిన సమయం లభిస్తుందని, దీనివల్ల ప్రజా సంబంధిత అంశాలను సభ దృష్టికి బలంగా తీసుకురాగలుగుతారని తెలిపారు.

సీట్లతోనే ప్రధాన ప్రతిపక్షం గుర్తింపు: జగన్

అసెంబ్లీ సీట్లలో 10శాతం సీట్లు రానందున వైసీపీ శాసనసభాపక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదనే చర్చ జరుగుతోందని జగన్ తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం... ఆర్టికల్-208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో పలానా సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని మీ ముందుకు తెస్తున్నానని అనేక చట్టసభల అంశాలను జగన్ వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తుచేశారు. 1984 లోక్‌సభలో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుందని, సభలో 10శాతం సీట్లు లేకపోయినప్పటికీ అప్పుడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారని ఉదాహరించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకు గాను కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించిందని, 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు లేకపోయినప్పటికీ పి.జనార్ధనరెడ్డిని ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారన్నారు. 2015లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగాను బీజేపీ కేవలం మూడు సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారని, ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తీసుకువస్తున్నానని జగన్ చెప్పారు.

ప్రజల తరపున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో ఈ లేఖ మీకు రాస్తున్నానని, అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా ఇప్పటికే అధికార కూటమి శతృత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే... అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న మీ విచక్షణ మీదే ఆధారపడి ఉంటుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యాబలాలను దృష్టిలో ఉంచుకుని నా లేఖను పరిశీలించాలని జగన్ కోరారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్‌ఎంల సేవలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా నున్న 554 గిరిజన పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎమ్‌ల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. గిరిజన పాఠశాలల్లో అనారోగ్యం, పోషక ఆహార లోపం సమస్యలు తలెత్తకుండా... తద్వారా విద్యార్థుల మరణాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తొమ్మిది ఐటీడీఏల పరిధిలోని 554 గిరిజన పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏఎన్ఎమ్‌లను పంపడంతోపాటు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో విద్యార్థులకు స్టడీ అవర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా 2,024 ఉపాధ్యాయులను గిరిజన పాఠశాలల్లో భర్తీ చేయను న్నట్లు ఆమె తెలిపారు. తల్లీబిడ్డా. ఎక్స్‌ప్రెస్ సేవలను పునరుద్ధరిస్తామని, ప్రసవం అనంతరం తల్లీ బిడ్డలను క్షేమంగా వారి ఇళ్లకు చేరుస్తామ న్నారు. వాహనాల ద్వారా రేషన్‌ను ఇంటి వద్దే పంపిణీ చేసే విధానం వల్ల గిరిజనులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నార న్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న 962 రేషన్ డిపోల ద్వారానే రేషన్ పంపిణీ చేసే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతామన్నారు.

దేశ పటంలోనే!

(మొదటిపేజీ తరువాయి)

వేయకపోతే ఎర్రచందనం జాడ దొరకదని పలువురు ఆవేదన చెందుతున్నారు.

రాయలసీమలోని కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాలతో పాటు కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఆరు లక్షల హెక్టార్లలో ఎర్రచందన అడవులు విస్తరించి ఉన్నాయి. వీటిలో 80 శాతంపైగా కడప, చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. 1973 ముందు వరకు స్మగ్లింగ్ ఉండేదికాదు. చైనా, జపాన్ ,జర్మనీ, నేపాల్ వంటి దేశాల్లో డిమాండ్ ఉండడంతో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ స్మగ్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. క్రమక్రమంగా బరితెగించడంతో 2007-2009 మధ్య కాలంలో పెద్ద ఎత్తున స్మగ్లింగ్ సాగింది. ఇందుకు కారణం తమిళ స్మగ్లర్లు ... కూలీలు అడవుల్లో చొరబడడమే. కోట్ల విలువచేసే సంపదను కూలీలతో కొట్టించి వారికి టన్నుకు లక్షో, రెండు లక్షలో ఇస్తూ ఒక్కోటన్ను రూ.కోటి వరకు సొమ్ము చేసుకుంటూ విదేశాలకు విక్రయిస్తుండడంతో రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా స్మగ్లర్లు ఎదిగిపోయారు. దీంతో చిత్తూరు, కడప జిల్లాలోని శేషాచలం పాలకొండలు, లంకమల, నల్లమల నుంచి అడవుల్లో ఎర్ర దొంగలు చొరబడతూ ఇష్టారాజ్యంగా చెట్లను నరికి తరలిస్తూ ప్రభుత్వం, పోలీసులు, అటవీశాఖలకు సవాల్‌గా మారారు. ఎర్రచందనం స్మగ్లింగ్ అధికశాతం మూడు ప్రధాన మార్గాల్లో జరుగుతున్నట్టు అటవీ, పోలీసులు అధికారులు గుర్తించారు. దుంగలను ఒక చోట పోగుచేసుకుని అక్కడి నుంచి కొందరు రాయచోటి-చింతామణి... పులివెందుల-గోరంట్ల మీదుగా కర్నాటక తీసుకెళ్లి ఇక్కడి నుంచి పోర్టులకు తరలించి దేశ సరిహద్దులు దాటిస్తున్నారు. తిరుపతి మీదుగా చెన్నై తరలించి పోర్టు ద్వారా స్మగ్లింగ్ నిరాటంకంగా సాగిస్తున్నారు. లంకమల, నల్లమల ప్రాంతాల్లో ఎర్రచందనాన్ని కర్నూలు మీదుగా హైదరాబాద్ తరలించి అక్కడి నుంచి వివిధ రకాల వాహనాల్లో ఇతర దేశాలకు తరలిస్తున్నట్లు తెలిసింది.

స్మగ్లర్‌లపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పీడీ యాక్ట్ కూడా నమోదు కావడంలేదు. నాన్ బెయిలబుల్ కేసులు లేకపోవడంతో యథేచ్ఛగా స్మగ్లింగ్ చేస్తూనే ఉన్నారు. గతంలో పీడి యాక్ట్ కేసులు పెట్టేవారు. 2014-15 మధ్య కాలంలో ఎక్కువ మందిపై పీడీ యాక్ట్‌లు పెట్టారు. ఆ తర్వాత పీడి యాక్ట్ మందగించిపోయింది. అధికారులు కోర్టుల్లో చార్జిషీట్లు వేయకపోవడం, అరెస్ట్ చేయకపోవడంతో పట్టుపగ్గాలు లేకుండా పోయిందని తెలుస్తోంది. గతంలో కృష్ణబాబు కలెక్టర్‌గా పని చేసినప్పుడు పీడీయాక్ట్‌లు పెద్ద ఎత్తున నమోదు చేయడమే కాకుండా

ఇంటిదొంగలను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అటవీశాఖలో 50 శాతం పైబడి సిబ్బంది కొరత ఉండడంతో ఆ శాఖ నిర్వీర్యమౌతోంది. పైగా 50 ఏళ్లు పైబడి ఉండడంతో స్మగ్లర్‌లను ఎదుర్కోవడం, కూంబింగ్ నిర్వహించడర కష్టతరంగా మారుతోందని చెబుతున్నారు. దీనికితోడు సరైన ఆయుధాలు లేకపోవడం కారణం. పైగా ప్రతి బీటు మూడు వేల హెక్టార్లు ఉంటుంది. ఇంత పెద్ద విస్తీర్ణానికి ఒక బీట్ ఆఫీసు రక్షణకు చాలడంలేదని తెలుస్తోంది. ప్రభుత్వాలు కఠిన చర్యలకు ఉపక్రమించకుంటే అడవుల జాడ దేశ పటంలో వెదుక్కోవాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. కాగా, నేడు కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడింది. చేవ కలిగిన నాయకుడిగా చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్ అటవీ శాఖ మంత్రిగా కూడా పగ్గాలు చేపట్టడంతో ఆయన ఏమేరకు చర్యలు చేపడతారో అన్న ఆసక్తితో ప్రజలు ఎదురు చూస్తున్నారు. స్మగ్లర్లపై కన్నెర్ర చేస్తేనే ఎర్రచందనం అడవులు మనుగడ కోల్పోకుండా ఉంటాయని స్పష్టం చేస్తున్నారు. పవన్ సార్ పవర్ సినిమా రీలా... రియల్‌గా ఉంటుందా అని గుసగుసలాడుతున్నారు.

ప్రతి ఎకరాకు నీరు

- యుద్ధ ప్రాతిపదికన కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఎకరాకు నీరందేలా అధికారులంతా క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ముంపు సమస్య ఎదురు కాకూడదని, అన్నదాతకు మేలు జరిగేలా కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులు యుద్ధ ప్రాతిపదికన పది రోజుల్లో మొదలు పెట్టేలా సమాయత్తం కావాలని ఆదేశించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారులు ఎం.వెంకటేశ్వర రావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డితో కలిసి శాఖకు సంబంధించిన ఉన్నతస్థాయి ఇంజినీరింగ్ అధికారులు, అన్ని జిల్లాల ఎస్‌ఈలతో వీడియో సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టులు, కాలువలు, డ్రెయిన్లు, ఏటిగట్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని విమర్శించారు. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి కష్ట నష్టాలు ఎదురుకాకుండా పంట కాలువలు, మురుగు డ్రెయిన్లలో ప్రక్షాళన పనులు పది రోజుల్లోగా చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రధానంగా తూడు, గుర్రపు డెక్క, మట్టి తొలగింపు పనులు చేపట్టాలన్నారు. కాల్వలు, డ్రెయిన్లలో లాకులు, అవుట్ స్లూయిస్, షట్టర్ తలుపుల మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. ఈ ఏడాది ఈ పనులు చేపట్టాలంటే ఏప్రిల్ నాటికి ప్రతిపాదనలు, మేలో టెండర్లు ఖరారు వంటివి జరిగితే వేసవిలో పనులు జరిగి ఉండేవని... వీటిపై ఎందుకు దృష్టి పెట్టలేదని అధికారులను మంత్రి ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చిన్నపాటి వర్షాలకు కూడా వేలాది ఎకరాల పంట పొలాలు ముంపునకు గురై రైతాంగం ఆర్థికంగా నష్టపోయిందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో గోదావరి ఏటి గట్ల పటిష్ఠతకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలవరంతోపాటు ఇతర ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విధ్వంసానికి గురయ్యాయని రామానాయుడు తెలిపారు. అన్నమయ్య, ఫించా, గుండ్లకమ్మ, పులిచింతల ప్రాజెక్టులను పట్టించుకోక పోవడంతో అవి ధ్వంసమైన విషయం తెలిసిందేన్నారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టుల వద్ద, రిజర్వాయర్ వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రం సస్య శ్యామలమయ్యే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. అనంతరం తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం తీసుకోబోతున్న చర్యలను మంత్రి వివరించారు. ధవళేశ్వరం, నాగార్జున సాగర్, శ్రీశైలం నుంచి విడుదల చేసే నీటిని సద్వినియోగం చేసుకోవడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అన్నదాతకు సేవ చేసే మహాభాగ్యం నీటి పారుదల శాఖకున్న అద్భుత అవకాశమని రామానాయుడు స్పష్టంచేశారు.

కేసులతో కలవరం

సజ్జల, అనిల్‌కుమార్‌పై ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి అనంతరం ఆ పార్టీ నేతలపై ఉన్న ఆరోపణలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా వెలికి తీస్తోంది. కూటమికి చెందిన నేతలు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. వైసీపీలో కీలక నేతగా రాణించిన ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై వివిధ ఆరోపణలతో ఫిర్యాదు చేశారు. విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై కేసు నమోదైంది. ఎంవోయూ పేరుతో ఖాళీ పత్రాలపై సంతకాలు పెట్టించుకున్నారనే ఆరోపణలపై హయగ్రీవ నిర్మాణ సంస్థ నిర్వాహకుడు జగదీశ్వరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గనుల వ్యవహారంపై సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరులపైన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన గనుల యజమాని బద్రీనాథ్ సీఐడీ డీఎస్పీకి ఫిర్యాదు చేయడం చర్చనీయంశంగా మారింది. సజ్జల అనుచరులు శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి దౌర్జన్యం చేశారని, గనుల్లో అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన స్థలం కబ్జా చేశారంటూ మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై నెల్లూరుకు చెందిన మహిళా పోలీసు ఫిర్యాదు చేశారు. నెల్లూరుజిల్లా భగత్‌సింగ్ కాలనీలోని తమ స్థలంలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వైసీపీలో మరో కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావుపై వలంటీర్లు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇప్పటికే ఓటమి నుంచి వైసీపీ నేతలు, కేడర్ తేరుకోలేకపోతున్నారు. తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయం కూల్చివేతతో పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. చాలా కార్యాలయాలకు నోటీసులు జారీజేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ నేతలు, శ్రేణులపై కూటమి నాయకులు దాడులకు పాల్పడ్డారు. ఇప్పుడు ఏకంగా పార్టీ ముఖ్యనేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలపైనే పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వరుసగా రావడంతో వారు కలవరం చెందుతున్నారు.

'పోలవరం' నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందే నిర్వాసితులకు సంబంధించి అన్ని సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్ఫూర్తి భవనంలో బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నందుకు అభినందనలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా యథాతథంగా నిర్మాణం చేపట్టాలని, ప్రాజెక్టు నిర్మాణం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు సంబంధించిన అన్ని సమస్యలను, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ఏరియాలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులు, గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలివ్వాలని ఆయన కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన కారణంగా రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించాలని, రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలపై సమీక్షించారు. ఎన్నికల సమయంలో కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేయాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు పట్టణాలలో నిర్మించిన టిడ్కో గృహాలకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించి... లబ్ధిదారులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏలూరు జిల్లాలో సీపీఐని సంస్థాగతంగా నిర్మాణం చేయడానికి కార్యకర్తలు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఎండి మున్నీరు, సన్నేపల్లి సాయిబాబు, ఎం.వెంకటాచారి, ఉప్పులూరి హేమశంకర్, పుప్పాల కన్నబాబు, బాడిస రాము, కారం దారయ్య, జమ్మి అవసరం శ్రీనివాస రావు, కంచర్ల గురవయ్య, జేవీ రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు: వడ్డే బాలయ్య

విశాలాంధ్ర-గుంటూరు: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్రంలోని వివిధ విభాగాలలో ఖాళీలు భర్తీ చేయాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) 18వ రాష్ట్ర మహాసభలు గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో హాల్‌లో జరగనున్నాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభల వివరాలను ఆయన వెల్లడించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఉదయం 10 గంటలకు మహాసభలు ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథులుగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి హాజరు కానున్నట్లు వివరించారు. వక్తలుగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు పాల్గొననున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం యూనియన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఉంటుందని చెప్పారు. యూనియన్ సభ్యులు పెద్దసంఖ్యలో హాజరై మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్య క్షుడు కోట మాల్యాద్రి మాట్లాడుతూ మెడికల్ ఎంప్లాయిస్ సమస్యలను, వారికి రావాల్సిన సౌకర్యాలను గత ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు మహా సభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

ఏఐటీయూసీ, అసోసియేషన్ నేతలకు మంత్రులు లోకేశ్, సంధ్యారాణి హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర సచివాలయంలో మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణిని వేర్వేరుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జె.లలిత, గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, ఉపాధ్యక్షులు జి.మల్లేశ్వరి కలిశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని మంత్రులకు విన్నవించారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి, మంత్రులకు నేతలు అభినందనలు తెలిపారు. వారిని శాలువాలతో సత్కరించారు. పోరాటాల ద్వారా సాధించుకున్న అంగన్‌వాడీల హక్కుల్ని కాపాడాలని, వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. 42 రోజుల నిరవధిక సమ్మె దానిని విచ్ఛిన్నం చేయడానికి ఆనాటి ప్రభుత్వం విధించిన నిర్బంధకాండను గుర్తుచేశారు. ఆ సందర్భంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... అంగన్‌వాడీల సమస్యలు, వారి

ఉద్యమం ఆనాటి ప్రభుత్వం విధించిన ఎస్మాలాంటి చట్టాలు గుర్తున్నాయని చెప్పారు. త్వరలో వాటన్నింటిని పరగణలోకి తీసుకొని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. మరో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి అన్ని యూనియన్లతో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సామరస్యంగా ఎలాంటి సమస్యలు లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిన మంత్రులకు అసోసియేషన్ నేతలు అభినందనలు తెలిపారు.

టెంట్‌హౌస్ అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-అద్దంకి: టెంట్‌హౌస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మంగళవారం విజయవాడలోని ఆషా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విజయ వాడకు చెందిన భాష, ఉపాధ్యక్షుడిగా విశాఖపట్నానికి చెందిన సీహెచ్ సుబ్బారావు, కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన శాంతి ఐరన్స్ వెంకటేశ్వర రావు, సహాయకార్యదర్శిగా అద్దంకికి చెందిన భాస్కర సప్లయర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాస రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సమావేశానికి 25 జిల్లాల నుంచి టెంట్ హౌస్ యజమానులు హాజరయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం త్వరలో జరగనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

వ్యవసాయానికి ఏపీ ఆదర్శం కావాలి

మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-మంగళగిరి: దేశంలోనే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళగిరిలోని కార్యాలయంలో వ్యవసాయ, సహకార శాఖలపై మంగళవారం సమీక్ష మంత్రి సమావేశం నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో వ్యవస్థలను గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా ప్రయత్నిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రెండు రోజుల్లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి... రుణాలు ఇచ్చే విధానంపై ఆలోచిస్తున్నామని తెలిపారు. దేశానికి వెన్నెముక రైతే అని చెప్పడం కాదని, చేతల్లో చేసి చూపించాలన్నారు. చంద్రబాబు నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అనుమతులు లేకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన పార్టీ కార్యాలయాలు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణం చేశారని, వీటిపై విచారణ చేస్తున్నామని వెల్లడించారు. వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని చట్ట ప్రకారమే కూల్చివేశామన్నారు. టీడీపీ పాలనలో కక్ష సాధింపు చర్యలు ఉండవని స్పష్టం చేశారు.

హయగ్రీవ భూ లావాదేవీలపై మాజీ ఎంపీ, మరో ఇద్దరిపై కేసు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: హయగ్రీవ భూ లావాదేవీలపై మాజీ ఎంపీ, డెవలపర్, ఆడిటర్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలివి... విశాఖ మాజీ ఎంపీ, ప్రముఖ బిల్డర్ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ గన్నమని వేంకటేశ్వరరావు (జీవీ), డెవలపర్ గద్దె బ్రహ్మాజీపై హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్ చిలుకూరి జగదీశ్ (జగదీశ్వరుడు) ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు శనివారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఐపీసీ 120బీ, 420, 465, 467, 468, 471, 383, 506, రెడ్ విత్ 34 ఐపీసీ సహా ఎనిమిది సెక్షన్లను విధించారు. ఎండాడలో 12.51 ఎకరాల్లో సీనియర్ సిటిజన్ హౌసింగ్ పేరిట 2010లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయగ్రీవ సంస్థకు భూములు కేటాయించింది. ఆ ప్రాజెక్టుకు ఆడిటర్‌గా జీవీని నియమించారు.

ఈ ప్రాజెక్టులో డెవలపర్లగా ఎంవీవీ సత్యనారాయణ, గద్దె బ్రహ్మాజీని జీవీ పరిచయం చేశారు. వీరి మధ్య 2020లో ఓ ఒప్పందం కుదిరింది. కాగా, చిలుకూరి జగదీశ్, అతడి భార్య రాధారాణి... తమను బెదిరించడమే కాకుండా, విలువైన పత్రాల్ని జీవీ, ఎంవీవీ స్వాధీనం చేసుకున్నారని, నకిలీ పత్రాలను సృష్టించి వాటిపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సేల్ డీడ్‌పై ఎంవీవీ, జీవీ నకిలీ సంతకాలు చేయించేశారనే ఆరోపణలు ఉన్నాయి. కోట్లాది రూపాయల ఆస్తిని కాజేసేందుకు బెదిరింపులకు వీరంతా పాల్పడ్డారని, సేల్ డీడ్ చేయించారని సమాచారం. ఇదిలా ఉండగా, ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో ఎంవీవీ స్క్వాష్ పిటిషన్ వేశారు. ఈ కేసులో ఏ-1గా గద్దె బ్రహ్మాజీ, ఏ-2గా జీవీ, ఏ-3గా ఎంవీవీతో పాటు మరికొంతమంది ఇతరులపైనా ఆరిలోవ సీఐ గంగుల గోవిందరావు కేసు నమోదు చేశారు. మరోపక్క హయ గ్రీవ భూములు కేటాయింపు రద్దు చేయాలని కోరుతూ జనసేన నేత మూర్తియాదవ్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర అశోకకు ఫిర్యాదు చేశారు. తక్షణమే నిర్మాణ పనులను ఆపివేయాలని, డెవలపర్లపై నమోదైన క్రిమినల్ కేసులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు చర్యలు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కు ఏపీ జేఏసీ అమరావతి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఆర్థికంగా జరిగిన నష్టాలను కూటమి ప్రభుత్వం ద్వారా సరిదిద్దాలని, 11 వ పీఆర్సీ బకాయిలు, 2018 నుంచి నిలిచిన డీఏ బకాయిలను తక్షణమే చెల్లించి ఉద్యోగులలో ఉన్న అసంతృప్తిని పొగొట్టేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి చేసింది. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, నాయకులు ఫణిపేర్రాజు, మురళీకృష్ణంనాయుడు తదితరులు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మెజార్టీ ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వంపై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పారు. ఉద్యోగులు ప్రధానంగా కోరుతున్న అంశాలలో బకాయిల చెల్లింపు, ప్రతినెలా 1 వ తేదీన జీతాలు, రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్లు చెల్లింపు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఎన్డీఏ మేనిఫెస్టో హామీ ప్రకారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు ముఖ్యమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, ఏపీ క్లాస్4 ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మల్లేశ్వరరావు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్లకు వినతులు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 27వ తేదీ గురువారం తహసీల్దార్ల ద్వారా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, గత ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రతి రైతు కుటుంబంపై రూ.2.45 లక్షల రుణభారం పడిందని, 2500 మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై విత్తన సరఫరా జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా అందడం లేదని రైతులు వాపోతున్నారని తెలిపారు. రైతులు, కౌలు రైతులకు రుణ సహకారం అందించడంలో బ్యాంకుల అశ్రద్ధ కనబడుతోందని, గత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన బకాయిలు రైతులకు చెల్లించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ.20 వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించేందుకు కృషి చేయాలని, పెరిగిన ఉత్పత్తి ఖర్చుల కనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు రూ.3 లక్షల వరకు వడ్డీలేకుండా... రూ.5 లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న ప్రధాన కాల్వలు, మేజర్, మైనర్ కాలువలతోపాటు డెల్టా ప్రాంతాల్లోని మురుగు నీటి కాలువల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతాంగానికి చెల్లించాల్సిన నిధుల బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, అసెంబ్లీ సమావేశాలలో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని కోరారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి, వేరుశెనగ, కంది తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీపై రైతాంగానికి అందించాలని, వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, బండ్లు, నాగలి తదితర పనిముట్ల కొనుగోలుపై 50 శాతం సబ్సిడీ అందించాలన్నారు. ట్రాక్టర్లకు 50 శాతం సబ్సిడీపై డీజిల్ సరఫరా చేయాలని, కల్తీ విత్తనాలు అరికట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, పొగాకు రైతులు పండించిన అదనపు పొగాకుకు పెనాల్టీ విధించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మరణించిన రైతు కుటుంబాలకు రూ.15 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.75 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతేడాది రబీలో కరవువల్ల నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని, పంటల బీమా నిధులు విడుదల చేయాలన్నారు. గత తెలుగుదేశ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ 4,5 విడతల బకాయిలు అనంతరం వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెల్లించలేదని, దీంతో నూతన కూటమి ప్రభుత్వ హయాంలో 4,5 విడుతల రుణమాఫీ నిధులు విడుదల చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో గౌరవ వేతనం పొందే కార్యకర్తల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్న డిమాండ్లతో తహసీల్దార్లకు వినతులు ఇవ్వాలని ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు.

డీఎస్సీ వయోపరిమితి 48 ఏళ్లకు పొడిగించాలి: పీడీఎస్‌యూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జులై 1న ప్రకటించబోయే డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో జనరల్ అభ్యర్థుల (ఓసీ) వయోపరిమితి సడలింపును 48 సంవత్సరాలకు పొడిగించాలని పీడీఎస్‌యూ జాతీయ కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మంగళవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. తొలుత విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌కు శుభాకాక్షలు తెలిపారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు, డీఎస్సీ నోటిఫికేషన్ దస్త్రంపై లోకేశ్ సంతకం పెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఆరేళ్ల నుంచి రాష్ట్రంలో డీఎస్సీ లేనందున, అప్పటి నుంచి నిరుద్యోగులు ఎదురుచూసి వయోపరిమితి మించిపోయిందని, దాదాపు లక్ష మందికిపైగా డీఎస్సీకి దరఖాస్తు చేసే అవకాశాన్ని కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని చివరి దశలో డీఎస్సీ 2024కు జనరల్(ఓసీ) అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ధారించి దరఖాస్తులను స్వీకరించారని, ఎన్నికల కోడ్‌తో దాని భర్తీ ప్రక్రియ నిలిచిపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 2018 తర్వాత ఇతవరకూ కొత్తగా డీఎస్సీనోటిఫికేషన్ రాలేదని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని డీఎస్సీకి జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్ల నుంచి 48 ఏళ్లకు పెంచాలన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ తదితర రిజర్వేషన్ అభ్యర్థులకు ఐదేళ్లు అదనంగా వస్తుందని చెప్పారు. ఖాళీగా 35 వేలకుపైగా ఉన్న పోస్టులను భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ భర్తీ ప్రక్రియకు డిసెంబరు వరకు డెడ్‌లైన్‌గా విధించడం వల్ల అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని వివరించారు. తక్షణమే జులై 1న టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను జారీజేసి, వాటి ప్రక్రియను మూడు నెలల్లో వేగవంతంగా ముగించేలా చూడాలన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం తరపున ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, దరఖాస్తు చేసిన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
ENGG.WING,1st Floor, APGC BUILDING, LAM, GUNTUR- 522034., A.P.

e-Procurement Tender Notice

Tenders are invited from the eligible contractors, for **Tender Notice Nos 1-2, Dated 24.06.2024 Civil works-2** Nos. through e-procurement. Details can be had form www.angrau.ac.in or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through http://www.apeprocurement.gov.in Downloading starts form **26.06.2024 @ 4.00 PM** onwards & end date for downloading is **10.07.2024 upto 4.00 PM**, For details contact : **9494065269.**

Dipr/3048PP/CL/ADVT-I/2021-22, Dt : 25/06/2024 **Sd/- ESTATE OFFICER**

సంపాదకీయం

బుల్డోజర్ ప్రజాస్వామ్యం

"ఈ దేశ ప్రజలు ప్రతిపక్షం నుంచి మంచి చర్యలు కోరుకుంటున్నారు. ప్రతిపక్షం ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నడుచుకుంటుందనీ, ప్రజాస్వామ్య గౌరవాన్ని కాపాడుతుందని ఆశిస్తున్నాను. ప్రజలకు కావాల్సింది నాటకాలు, కల్లోలాలు కాదు. ప్రజలకు అసలైన సారం కావాలి. నినాదాలు కాదు. దేశానికి మంచి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కావాలి. 18వ లోకసభకు ఎన్నికైన వారు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారన్న విశ్వాసం నాకు ఉంది." 18వ లోకసభ ఎన్నికైన తరవాత పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన మహోజ్ఞాన బోధ ఇది. ఈ మాటలన్నీ వింటే 240 స్థానాల దగ్గరే కుదేలై, ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాల మీద, ఎన్నికల తరవాత తెలుగు దేశం, జె.డి.(యు) నుంచి అందిన మద్దతు మీద అధికారంలోకి వచ్చిన మోదీ "సాధు జీవి"గా మారిపోయారని భావిస్తే అది కేవలం భ్రమే అని తేలిపోవడానికి 24 గంటలు కూడా పట్టలేదు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక విషయంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ సంపూర్ణమైన మెజారిటీ ఉన్న కిందటి రెండు లోక్‌సభలలో వ్యవహరించినట్టే బుల్డోజర్ రాజకీయాలనే కొనసాగిస్తోంది. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన నాటినుంచి అధికారపక్షం అదే అహంకారపూరిత ధోరణినే కొనసాగిస్తోంది. ప్రోటెం స్పీకర్‌ను ఎంపిక చేయాల్సి వచ్చినప్పుడే పార్లమెంటరీ సంప్రదాయాలకు, ప్రజాస్వామ్య కట్టుబాట్లకు తిలోదకాలు ఇచ్చేసింది. మామూలుగా అందరికన్నా సీనియర్ సభ్యుడిని అంటే ఎక్కువ సార్లు ఎన్నికైన సభ్యుడిని ప్రోటెం స్పీకర్‌గా ఎంపిక చేయడం ఆనవాయితీ. ఆ సందర్భంలో ఆ వ్యక్తి అధికార పక్షం వారా లేక ప్రతిపక్షం వారా అన్న అంశంతో నిమిత్తం లేదు. అందరికన్నా సీనియర్ అయితే చాలు. ఈ లెక్కన కేరళ నుంచి ఎనిమిదోసారి ఎన్నికైన కొడికున్నిల్ సురేశ్ ప్రోటెం స్పీకర్‌గా ఎంపిక కావాల్సింది. కానీ మోదీ నేతృత్వంలోని అధికార పక్షం తమ పార్టీకి చెందిన మహతాబ్ ఏడుసార్లే ఎన్నికైనా ఆయనని ప్రోటెం స్పీకర్ చేసేసి ఆధిపత్య ధోరణిని ప్రదర్శించింది. స్పీకర్‌ను ఎన్నుకోవలసి వచ్చేటప్పటికి అదే మంకుతనం మరింత తీవ్రంగా కొనసాగించింది. కిందటి లోక్‌సభలో స్పీకర్‌గా ఉన్న ఓం బిర్లానే ఈ సారి కూడా స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టాలనుకుంది. అధికార పక్షానికి 293 మంది సభ్యుల మద్దతు ఉంది కనక ఒకవేళ స్పీకర్ స్థానానికి ఎన్నిక జరిగినా ఫలితం ఎలా ఉంటుందో ఊహించడం కష్టం కాదు. కానీ ఈ క్రమంలో డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇస్తున్న సంప్రదాయాన్ని అధికార పక్షం బాహాటంగా, నిస్సిగ్గుగా తుంగలో తొక్కింది. డిప్యూటీ స్పీకర్ గా ప్రతిపక్ష అభ్యర్థిని ఎన్నుకోవడానికి సహకరిస్తే స్పీకర్ స్థానానికి అధికార పక్షం అభ్యర్థిని సమర్థిస్తామని ప్రతిపక్షం స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకున్నా అధికార పక్షం హేతుబద్ధంగా ఆలోచించడానికి తిరస్కరించింది. అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జె.పి.నడ్డాలాంటి వారి మంతనాల పేరుతో తన పంతమే చెల్లించుకోవాలన్న అప్రజాస్వామిక వైఖరి అనుసరించింది.

ఈ నేపథ్యంలో గెలుపోటములతో నిమిత్తం లేకుండా ప్రతిపక్షం అస్తిత్వాన్ని రుజువు చేసుకోవడానికి సురేశ్‌ను ప్రతిపక్షం స్పీకర్ ఎన్నికకు రంగంలోకి దించింది. ఇది అధికార పక్షం దృష్టిలో దాష్టీకం కింద కనిపిస్తోంది. గత లోకసభ అయిదేళ్లు డిప్యూటీ స్పీకర్‌గా ఎవరినీ నియమించకుండానే మోదీ కాలం గడిపేశారు. అలాంటిది ఆయన ప్రతిపక్షాలకు ప్రజాస్వామ్యం అంటే ఏమిటో, ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేర్చాలో పాఠాలు చెప్పే దుస్సహసానికి ఒడిగట్టారు. సభలో అధికార పక్షానికి తగినంత మద్దతు ఉంది కనక ఓం బిర్లా ఎన్నికైతే ఆశ్చర్య పోవలసింది ఏమీ లేదు. కిందటి సారి డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకు ఎందుకు ఇవ్వలేదు అంటే అప్పుడు ఏ పక్షానికీ అధికారికంగా ప్రతిపక్ష హోదా లేదు కదా అని రేవణాలు తీస్తున్న మోదీ బృందం ఇప్పుడు అధికారికంగా ప్రతిపక్షంగా గుర్తించదగినంత మంది సభ్యులు కాంగ్రెస్‌కు ఉన్నారన్న వాస్తవాన్ని గుర్తించడానికి సిద్ధంగా లేదు. ఇది మోదీ మార్కు ప్రజాస్వామ్యం కనకే ఏ నిబంధనలను, ఆనవాయితీలను ఖాతరు చేయరు. మోదీ బుల్డోజర్ రాజకీయాల పుణ్యమా అని మన పార్లమెంటు చరిత్రలో మొదటిసారి స్పీకర్ పదవికి బుధవారం ఎన్నిక అనివార్యం అవుతోంది. నడవడిలో నిండు నిరంకుశత్వం మరోసారి విలయ తాండవం చేయబోతోంది. "గత పది సంవత్సరాలలో మేం ఎప్పుడూ సంప్రాదాయాన్ని పాటించడానికే ప్రయత్నించాం. ప్రభుత్వాన్ని నడపడానికి మెజారిటీ అవసరం, కానీ దేశాన్ని నడపడానికి ఏకాభిప్రాయం అత్యంత ఆవశ్యకం" లాంటి మాటలు మోదీ నోటివెంట వింటే ఆవేశం, ఆగ్రహం కాదు జుగుప్స కలుగుతోంది. మోదీ వైఖరిలో వచ్చిన మార్పల్లా మాటల్లో సుద్దులు చెప్పడం, చేతల్లో మునుపటి ఆధిపత్య వైఖరినే అనుసరించడం చూస్తే ఆయన నిరంకుశ విధానాలకు మెజారిటీ కారణం కాదనీ అది ఆయనకు నరనరాన జీర్ణించుకుపోయినతత్వం అని స్పష్టం అవుతోంది. ఇంతకు ముందులాగా బీజేపీకి సొంతంగా మెజారిటీ లేదని, మొన్నటి ఎన్నికలకు ముందు మళ్లీ ప్రాణం పోసిన ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాల మీద, ఎన్నికల తరవాత తమ అవసరాల కోసం ఎన్.డి.ఎ.లో చేరిపోయిన తెలుగుదేశం, జె.డి.(యు) మీద ఆధారపడి ప్రభుత్వం నడపాలంటే సంకీర్ణ ధర్మం పాటించాలన్న ధ్యాసే మోదీకి లేదు. సోమవారం మోదీ ఎంపీలను ఉద్దేశించి మాట్లాడినప్పుడు 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీని మళ్లీ తవ్వి తీశారు. ఎమర్జెన్సీ అప్పుడూ ప్రజాస్వామ్యవాదులు, సవ్యంగా ఆలోచించేవారెవరూ సమర్థించలేదు. మోదీ ఎమర్జెన్సీ పాట పాడడం తన లోపాలను కప్పిపుచ్చుకోవడానికే. ఎమర్జెన్సీ విధించకుండానే అంతకు మించిన నిరంకుశ పాలన కొనసాగిస్తున్న మోదీకి అసలు ఎమర్జెన్సీ పేరెత్తడానికే నైతిక హక్కులేదు. సమస్యంతా మోదీకి నైతికత బొత్తిగా లేకపోవడమే. అందరి సహకారం తీసుకుంటామని మోదీ అంటున్న మాటలకు వీసమెత్తు విలువలేదు. రాజ్యాంగ పవిత్రతను కాపాడతామని పదే పదే చెప్పడానికి అంతకన్నా వీలు లేదు. పార్లమెంటు సమావేశాల మొదటి రోజునే ప్రతిపక్షాలు రాజ్యాంగ ప్రతులు పట్టుకుని ఊరేగింపుగా వచ్చి నిరసన తెలియజేశారు. ఇదైనా మోదీకి హెచ్చరికగా పని చేస్తున్న నమ్మకమూ లేదు. నిన్నగాక మొన్న కళ్లు తెరిచిన టీడీపీ నాయకుడు, కేంద్ర మంత్రి కింజారపు రామమోహన నాయుడు కూడా షరతులు విధించడం ప్రజాస్వామ్య లక్షణం కాదని సూక్తి ముక్తావళి వల్లిస్తున్నారు. ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ పక్షం చర్చలకు, సంప్రదింపులకు, ఏకాభిప్రాయానికి విలువ ఇవ్వడం. అంతకన్నా ముఖ్యమైంది మైనారిటీ పక్షం మాట మీద ఆధారపడి నిర్ణయాలు తీసుకోక పోయినా ఆ పక్షానికి తమ అభిప్రాయం తెలియజేసే అవకాశం ఇవ్వడం. ఇది మోదీ హయాంలో కలికానికైనా లేదు.

ఫ్రాన్సులో లెఫ్ట్ కూటమి గెలుపు అవకాశాలు

ఫ్రాన్సు జాతీయ అసెంబ్లీకి అతి త్వరలో జరగనున్న ఎన్నికల్లో 68 ఏళ్ల తర్వాత లెఫ్ట్ కూటమి గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ జూన్ 30 న, జూలై 7 న జాతీయ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఆకస్మికంగా ప్రకటించారు. జూన్ 9 న ఐరోపా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఫ్రాన్సు దారుణంగా ఓటమి చెందడంతో మాక్రాన్ పై మేరకు నిర్ణయం తీసుకున్నారు. మితవాదులు గెలిచి ఫ్రాన్సులో అధికారం చేపట్టవచ్చునని ప్రధాన మీడియా సంస్థలు అంచనా వేస్తున్న సమయంలోనే వామపక్ష పార్టీలు కూటమిగా ఏర్పాటయ్యాయి. దీంతో ఫ్రాన్సులో రాజకీయాలు కొత్త మలుపు తీసుకోనున్నాయి. మితవాద పార్టీని వ్యతిరేకించే శక్తులన్ని ఏకమయ్యాయి. 1936 తర్వాత పాపులర్ ఫ్రంట్ రాజకీయాలు ప్రముఖంగా చెలాయించాయి. ఇప్పుడు వామపక్ష కూటమి దేశాన్ని పాలించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పరిశీలకుల అంచనా. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, గ్రీన్సు, జీన్‌లిన్‌మెలెంఛాన్‌కు చెందిన ఫ్రాన్సు అన్‌బౌడ్ పార్టీలు ఒక్కటయ్యాయి. మెరైన్ లీపెన్ పార్టీకి 31 శాతం ఓట్లు ఉన్నాయని ప్రాథమిక అంచనా ఉండగా, వామపక్ష కూటమి 3 శాతం ఓట్లు తక్కువగా ఉన్నాయని కూటమి ఏర్పాటైన కొద్దిరోజుల్లో అంచనాలు వచ్చాయి. మాక్రాన్ పార్టీ అతి తక్కువగా 14 శాతంతో మూడవ స్థానంలో ఉంది. ఆదివారం వెల్లడైన తాజా సర్వేలో లీ పెన్ నేతృత్వంలోని అతి మితవాద పార్టీ ఆర్ఎన్‌కు వామపక్ష గట్టిపోటీ నిస్తున్నట్లుగా వెల్లడైంది. లీ పారిసియన్ దినపత్రిక, రేడియో ఫ్రాన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఇప్సోస్ సర్వేలో ఆర్ఎన్ పార్టీ 35.5శాతం ఓట్లతో ముందుంది. వామపక్ష కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్) 29.5 శాతంతో ద్వితీయస్థానంలో ఉంది. అధ్యక్షుడు మాక్రాన్ నేతృత్వంలోని అధికార మధ్యేవాదకూటమి 19.5శాతంతో తృతీయ స్థానంలో నిలిచింది.

ప్రజల ఆలోచనా ధోరణిలో వచ్చిన మార్పు ఏమిటో ఆలోచించాలి. 2022 లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మాక్రాన్‌కు జీన్ మెలెంఛాన్ గట్టి పోటీ ఇచ్చారు. అనంతరం వామపక్షాల మధ్య గత రెండేళ్లుగా సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. వామపక్షాలలో తీవ్ర నిరశ ఏర్పడింది. మితవాదంలోనే ఫ్రాన్సు కూరుకుపోతుందని భావించాయి. అయితే రెండు వారాలుగా వూహించలేని మార్పు జరిగింది. లీపెన్ ఎన్నికల్లో గెలుస్తారని అంచనాలు వచ్చాయి. ఇదే సమయంలో వామపక్షాల మధ్య ఐక్యత ఏర్పడింది. ప్రగతిశీల శక్తులన్నీ ఒకే బ్యానర్ కిందకు వచ్చాయి. మాక్రాన్‌తో ఉన్న మధ్యేవాద పార్టీలన్నీ బయటకు వచ్చి న్యూ పాపులర్ ఫ్రంట్‌కు మద్దతు పలికాయి. వాస్తవంగా మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలు ప్రకటించవలసిన పనిలేదు. 2022 ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టారు.

2027 వరకు అధికారంలో కొనసాగవచ్చు. జాతీయ అసెంబ్లీలో మొత్తం 577 సీట్లుండగా మాక్రాన్‌కు 250 సీట్లున్నాయి. ముఖ్యమైన చట్టాల ఆమోదానికి తగినంత మంది తోడ్పాటు లేక ఇబ్బంది పడుతున్నారు. మెరైన్ లీపెన్ మితవాద పార్టీ తన పార్టీ పలుకుబడిని పెంచుకున్నాడు. మాక్రాన్ పార్టీ పలుకుబడి దిగజారింది. అధ్యక్షుడిగా మాక్రాన్ బలహీనుడయ్యాడు. ఈ నేపథ్యంలో జాతీయ అసెంబ్లీలో 88 సీట్ల బలంతో లీపెన్ ఉన్నారు. ఈసారి జరగనున్న ఎన్నికల్లో మాక్రాన్ పార్టీని ఓడించగలరని ప్రధాన మీడియా అంచనా వేసింది. గెలవడానికి 289 సీట్లు గెలుచుకోవాలి. మొదటి రౌండ్‌లో 12.5 శాతం ఓట్లు రానివాళ్లు పోటీ నుంచి తప్పుకున్నారు. 50 శాతం ఓట్లు వచ్చిన వారు గెలిచినట్లవుతుంది. మొదటి రౌండ్‌లో ఎవరూ గెలవకపోతే రెండవ రౌండ్ కీలకంగా ఉంటుంది. అయితే ఈ రౌండ్‌లో ఒక అభ్యర్థిని ఓడించాలన్న అవగాహన ఉంటుంది. మరో ఆసక్తి కలిగించే విషయం మాక్రాన్ 2027 వరకు అధ్యక్ష స్థానంలో కొనసాగవచ్చు. జులై 7 న జరిగే రెండో రౌండ్‌లో గెలిచిన వారు ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

అయినా మాక్రాన్ కూడా అదే ప్రభుత్వంతో కలిసి కొనసాగే అవకాశం ఉంటుంది. 2027 వరకు తాను అధ్యక్షుడిగా కొనసాగుతానని ఇప్పటికే మాక్రాన్ ప్రకటించాడు. తమ పార్టీ ఓడిపోయినా అధ్యక్షుడిగా కొనసాగుతానని అన్నారు. ఈ నేపథ్యంలో వామపక్ష కూటమి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలున్నాయి. కమ్యూనిస్టు పార్టీ 50 సీట్లలో పోటీ చేయనున్నది. గత కొన్నేళ్లుగా కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై కమ్యూనిస్టు పార్టీ శ్రద్ధ పెట్టి పని చేస్తున్నది. కూటమి గెలుపు కోసం అన్ని ట్రేడ్ యూనియన్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

ఆలింగనం కాదు రాష్ట్రాన్ని ఆదుకోవాలి

చలసాని వెంకటరామారావు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు అపూర్వ మెజారిటీతో విజయం సాధించిన ఎన్డీయే కూటమి తరపున తెలుగుదేశం నాయకులు నారా చంద్రబాబునాయుడు నాల్గవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు శ్రీకారం అంటూ పత్రికలు పతాక శీర్షికలను ప్రకటించాయి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యవాదులు, తెలుగుదేశం, కూటమి పక్షాలు సంబరాలు చేసుకున్నారు. గన్నవరం విమానాశ్రయానికి దగ్గరలో జరిగిన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరై వేడుక ఆసాంతం వేదికపై ఉన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేదికపై ప్రధాన మంత్రికి పాదాభివందనం చేయాలని ప్రయత్నించగా మోదీ వారించి చంద్రబాబును ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. మోదీ ఏది చేసినా ఒక మతలబు ఉంటుంది. అది భవిష్యత్‌కు ఒక సూచికగా ఉంటుంది. గతంలో ప్రధానమంత్రి మోదీ అమరావతి శంకుస్థాపనకు 2014 అక్టోబరు 22 న రాజధాని శంకుస్థాపన జరిగిన ఉద్దండరాయునిపాలెంకు ముఖ్య అతిథిగా వచ్చారు. ఆనాడు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మోదీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. శంకుస్థాపన అనంతరం జరిగిన బహిరంగ సభలో మోదీ ఆంధ్ర ప్రజలకు వరాలు గుమ్మరిస్తారని, అమరావతి నిర్మాణానికి భారీ మొత్తం ప్రకటిస్తారని ఎదురుచూశారు. కానీ మోదీ ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చి ఎటువంటి హామీ, భరోసా ఇవ్వకుండా ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన 'చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి' ముఖ్యమంత్రి చేతుల్లో పెట్టి వెళ్లారు. అది ఆనాడు మోదీ ప్రభుత్వం ఆంధ్ర ప్రజలకు ఏమి చేయబోతున్నదో తెలియజేసే భవిష్యత్ సూచికగా వ్యక్తం అయింది. అప్పటి నుంచి 2019 వరకు రాష్ట్రానికి, అమరావతికి ఆ చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టే గతి అయ్యాయి. చివరకు ఢిల్లీ చుట్టూ తిరిగి విసిగి వేసారిన రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం నాయకులు చంద్రబాబు ఎన్డీయేకు చెల్లుచీటీ ఇచ్చి కూటమి నుంచి బయటపడ్డారు.

ఇప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ చంద్రబాబును ఆలింగనం చేసుకోవటంపై వివిధ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. మహాభారతంలో ధృతరాష్ట్రుడు అంధుడు. కానీ అపారమైన బలశాలి. తన కొడుకుల దుర్మార్గాన్ని గుడ్డిగా సమర్థించేవాడు. కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల చేతిలో వందమంది కుమారులను కోల్పోయాడు. యుద్ధం ముగిసింది. కృష్ణుడు పాండవులతో పట్టాభిషేకం చేయించమని ధృతరాష్ట్రుని దగ్గరకు తీసుకువచ్చాడు. అప్పుడు భీముడిని అడిగి దగ్గరకు రమ్మని, దుర్యోధనుని సంహరించినందుకు, ప్రతిగా క్రోధంతో దీవిస్తున్నట్లుగా నటిస్తూ భీముడిని తాను బాహుబంధంలో బంధించబోయాడు. ధృతరాష్ట్రుని దుష్ట బుద్ధిని ముందే గ్రహించిన శ్రీకృష్ణుడు తన మాయతో ఇనుప భీముడ్ని సృష్టించి భీముని స్థానంలో ఆ ప్రతిమను ఉంచాడు. భీముడ్ని తన బాహువులతో నొక్కినొక్కి పిండి పిండి చేశాడు ధృతరాష్ట్రుడు. దానిని ధృతరాష్ట్ర కౌగిలి అంటారు. దుర్మార్గుడి చేతిలోపడితే భస్మమైపోతారని చెప్పటానికి ధృతరాష్ట్రుని కౌగిలి అనేది ఒక జాతీయంగా మిగిలిపోయింది. ఇప్పుడు మోదీ కౌగిలి గతంలో మట్టి, నీళ్లు ఇచ్చినట్లు ధృతరాష్ట్ర కౌగిలి కాదుగదా? అని ప్రజలు భయపడుతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆనాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చింది. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ సైతం ఆ హామీలను బలపర్చింది. 2014 సాధారణ ఎన్నికలలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి చెంది నరేంద్రమోదీ ప్రధానిగా బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారం చేపట్టింది.

ఆనాడు రాష్ట్ర విభజన చట్టంలో ఐదు ఏళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం అనేక ప్రోత్సాహకాలు ఇస్తామని, రాయలసీమ, ఉత్తరాంధ్రలోని ఏడు వెనుకబడిన జిల్లాలకు 'బుందేల్‌ఖండ్' తరహాలో ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని, పోలవరం జాతీయ ప్రాజెక్టుగా పూర్తిచేసే బాధ్యత కేంద్రం తీసుకుంటుందని, ఉమ్మడి రాష్ట్ర సిబ్బంది, ఆస్తులు, అప్పులు పంపిణీ నిర్దిష్ట సమయంలో పూర్తి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వ లోటు బడ్జెట్‌ను 2014-15 కేంద్ర బడ్జెట్‌లో భర్తీ చేస్తామని వాగ్దానం చేశారు. వీటికితోడు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు వంటి వివిధ హామీలను ఇచ్చారు. 2014 మార్చి 1 న రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ విభజన చట్టానికి ఆమోదముద్ర వేశారు. ఆ మరుసటిరోజు మార్చి 2 న విభజన చట్టానికి సవరణచేసి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పోలవరం ముంపు మండలాలు ఏడింటిని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. విద్యుత్ పంపిణీని ఈ సవరణలో సరిచేశారు. ఈ సందర్భంగా నాటి నూతన ప్రధానమంత్రి మోదీ తిరుపతి పుణ్య క్షేత్రానికి వచ్చిన సందర్భంగా ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధానిని ఆంధ్రప్రదేశ్‌కు నిర్మిస్తామని వాగ్దానంచేసి ఆశలు రేపారు. అంతకుముందు ఎన్నికల ప్రచారసభల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇస్తామని వాగ్దానం చేశారు.

బీజేపీ ప్రభుత్వం ఆనాడు మిత్రపక్షాలపై ఆధారపడే పరిస్థితి లేకపోవటంతో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీని ఏమాత్రం లక్ష్య పెట్టలేదు. విభజన చట్టంలోను, పార్లమెంటులోను ఇచ్చిన హామీలను గాలికి వదిలివేశారు. పార్లమెంటులో ఐదేళ్లు ప్రత్యేక హోదా అని ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటిస్తే కాదు 10 ఏళ్లు ఇవ్వాలని పట్టుబట్టిన వెంకయ్య నాయుడు, అరుణ్‌జైట్లీ ప్రధాని మోదీపై వత్తిడి చేయలేకపోయారు. ప్రణాళిక సంఘం రద్దుచేసి దాని స్థానంలో ఏర్పాటు చేసిన నీతిఆయోగ్ ద్వారా ప్రత్యేక హోదాను నిరాకరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయే భాగస్వామిగా ఉండి వత్తిడి చేయగా హోదా సాధ్యంకాదని రాష్ట్రానికి ప్రత్యే క ప్యాకేజీ ఇస్తామని, హోదా వలన వచ్చే ప్రయోజనాలన్నీ కల్పిస్తామని చెప్పి రాష్ట్రానికి మొండిచేయి చూపించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భారీగా నిధులు సమకూర్చుతామనిచెప్పి అంతకు ముందు కేంద్రమంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు విజయవాడ, గుంటూరు పట్టణాల అభివృద్ధికి కేటాయించిన వెయ్యికోట్లు కూడా కలిపి 1500 కోట్లు మాత్రమే ఇచ్చారు. వాస్తవానికి రాజధాని నిర్మాణానికి ఇచ్చింది 500 కోట్లు మాత్రమే. వెనుకబడిన ఏడు జిల్లాలకు అరకొరగా జిల్లాకు 50 కోట్ల చొప్పున మూడేళ్లు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారు. విశాఖపట్నం రైల్వేజోన్‌ను, కడప ఉక్కు ఫ్యాక్టరీని అటక ఎక్కించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధుల విడుదలలో కొర్రీలు పెడుతున్నారు. నిర్వాసితుల ప్యాకేజి విషయంలో తమకు సంబంధంలేదని, రాష్ట్రమే చెల్లించాలని వేల కోట్ల రూపాయల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఆస్తులు, అప్పులు సమస్యలు దశాబ్దకాలంగా పరిష్కారం కాకుండా నిలిచిపోయాయి. కేంద్రం ఈ విషయంలో సరైన చొరవను ప్రదర్శించటం లేదు. రాష్ట్ర లోటుబడ్జెట్‌ను భర్తీ చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందించలేదు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోవటంతో విభజన హామీల అమలులో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంది. పోలవరం ప్రాజెక్టు పనులు, అమరావతి నిర్మాణం ప్రారంభించినా అభివృద్ధి, సంక్షేమంలో వెనుబడినందున ప్రజాగ్రహానికిగురై 2019 ఎన్నికలలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 2019 లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టును, అమరావతి నిర్మాణాన్ని గాలికి వదిలివేశాడు. రాష్ట్రం ఈ ఐదేళ్లలో జగన్ పాలనలో భారీ నష్టాన్ని మూటగట్టుకుంది. రాష్ట్రం అభివృద్ధి చెందకపోగా అన్ని రంగాలలో వెనుకబడిపోయింది. ప్రజాగ్రహం కట్టలు తెంచుకుని 2024 ఎన్నికలలో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు జగన్‌ను ఓడించారు. 2024 ఎన్నికల ముందు బీజేపీ ప్రభుత్వం చంద్రబాబును జైలుకు పంపటంలో జగన్‌కు సహకరించి, తెలుగుదేశం విజయం తథ్యమని తెలిసి చంద్రబాబును ఎన్.డి.ఏ.లో చేర్చుకుని రాజకీయ ప్రయోజనం పొందారు. తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు 16 మంది మద్దతు లేకుండా కేంద్రప్రభుత్వం మనజాలని పరిస్థితి నేడు కేంద్రంలో ఉంది. విభజన హామీలను అమలు జరిపించు కోవటంలోను, అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించు కోవటంలో ఇప్పుడు చంద్రబాబు చాణక్యనీతిని ప్రదర్శించవలసిఉంది. పోలవరం ప్రాజెక్టు పూర్తికి, రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్రం నుండి రాబట్టాలి. రైల్వేజోన్, కడప ఉక్కు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధించుకోవాలి. అభివృద్ధి, సంక్షేమం రెంటిని జోడు గుర్రాలుగా పరుగెత్తించాలంటే ఆర్థిక వనరులు పెంచుకోవాలి. గత ఐదేళ్లుగా అస్తవ్యస్తమైన ఆర్థికస్థితిని గాడిన పెట్టాలి. అందుకు చంద్రబాబు మోదీ కౌగిలింతల గిల్లింతలతో తృప్తి పడకుండా రాష్ట్రంలోని అన్ని పక్షాలను కలుపుకుని కేంద్రంపై పోరాటం సాగించాలి. రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలి. అప్పుడే మోదీ ఆలింగనం ధృతరాష్ట్ర కౌగిలి కాకుండా పోతుంది.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093

ఇండియా కూటమిలోకి మరిన్ని పార్టీలు

నిత్య చక్రవర్తి

పద్దెనిమిదవ పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావడంతోనే సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ప్రధాని నరేంద్ర మోదీకి అప్పుడే రెండు అపశకునాలు ఎదురయ్యాయి. మరోపక్క ప్రతిపక్ష ఇండియా కూటమిలో మరిన్ని పార్టీలు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనేక లక్షల మంది భవిష్యత్‌కు సంబంధించిన నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాల వెల్లడి కుంభకోణం మోదీ ప్రభుత్వ తలకు చుట్టుకుంది. ఎన్నికలకు ముందు ఈ కుంభకోణం వెల్లడైఉంటే బీజేపీ పరిస్థితి మరింత దిగజారి ఉండేది. మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వహయాంలో వ్యాపం కుంభకోణం దేశమంతటా గగ్గోలు పుట్టించింది. మోదీ ప్రభుత్వం సైతం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నది.

ప్రచార ఆర్భాటంతో నిర్మించిన రామాలయం పై కప్పు వర్షం వస్తే నీళ్లు కారుతోందని వెల్లడై ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. బీజేపీ ఎంపీలకు కొత్తప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న సమయంలోనే రామాలయం ప్రధాన పూజారి సత్యేంద్రదాస్ ఆలయం పై కప్పు నీళ్లు కారే అంశం మోదీకి తెలియజేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రయోజనం కోసం దేశ విదేశాల్లో రామాలయంపై మోదీ ఆర్భాటంగా డప్పు వాయించారు. ఇండియా కూటమి బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. లోక్‌సభ సమావేశాల మొదటి రోజున ఇండియా కూటమి సభ్యులు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ, రాజ్యాంగం పుస్తకాలను పట్టుకొని ప్రదర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లోనూ ఇదే విషయాన్ని విస్తృతంగా ప్రజలకు వివరించారు. దీనిపై ప్రజలు సానుకూలంగా స్పందించారని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. మోదీ పదేళ్లకాలంలో ప్రజాస్వామ్యాన్ని దిగజార్చిన అంశంపై ప్రతిపక్షం మోదీ ప్రభుత్వాన్ని నిలదీయనున్నది. లోక్‌సభ ఎన్నికల్లో పొందిన ప్రయోజనాలను మరింత పటిష్టం చేసుకునేందుకు ఇండియా కూటమికి ఇది మంచి అవకాశం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏకు దూరంగాఉన్న మరికొన్ని పార్టీలు ఇండియాకూటమిలో చేరనున్నాయన్న సూచనలు వెలువడ్డాయి.

ఒడిశాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన బిజూ జనతాదళ్ (బీజేడీ) అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బీజేపీతో సంబం ధాలను పూర్తిగా వదుల ుకుంటున్నట్లు ప్రకటించారు. అంతేకాదు, రాజ్యసభలో ఉన్న 9మంది తమ పార్టీ సభ్యులను ఇండియా కూటమితో సమన్వయం చేసుకుంటూ, మోదీ ప్రభుత్వ విధానాలపై పోరాడాలని ఆదేశించారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు జరిపిన చర్చలు విఫలం కావడంతో నవీన్ పట్నాయక్ బీజేపీ పొత్తులేదని ప్రకటించారు.

రాజ్యసభలో మొత్తం 245 సీట్లుండగా, ఇండియా కూటమికి 85 మంది సభ్యులున్నారు. బీజేడీకి చెందిన 9మంది సభ్యులు చేరితే మొత్తం సంఖ్య 94కు చేరుతుంది. రాజ్యసభలో వైసీపీ సభ్యులు 11మంది ఉన్నారు. వీరు ఇండియాకూటమికి సహకరిస్తే ప్రతిపక్షం సంఖ్య 105కు చేరుకుంటుంది. అప్పుడు ప్రతిపక్షం రాజ్యసభలో బలంగా ఉంటుంది.

బీజేడీ, వైసీపీ సభ్యులు ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడినట్లుగా ఆ పార్టీవర్గాలు తెలియజేశాయి. అలాగే రాజ్యసభలోనూ మరికొన్ని చిన్నచిన్న పార్టీలు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఇండియా కూటమికి తోడ్పాటు అందించాలని ఆసక్తిగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు సంబంధించిన కొన్ని అంశాలపై సమీక్షించుకునే పనిలో ఈ పార్టీలు ఉన్నాయని తెలుస్తోంది. అలాగే టీఎంసీ, డీఎంకే నాయకులను ఇండియా కూటమిలో వారి స్థానాలను గురించి చర్చించనున్నారు. బీజేపీతో పోరాడేందుకు ప్రతిపక్షానికి మరింత బలం చేకూరనుంది. త్వరలో కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం ప్రతిపక్ష పార్టీలన్నీ ఐక్యంగా పోరాడవలసిన ఆవశ్యకత ఉన్నది. ఈ దిశగా చర్చలు జరగనున్నాయి. ప్రతిపక్షకూటమి కలిసికట్టుగా పోరాడి మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాలలో విజయం సాధించే అవకాశాలున్నాయి. ఈ రాష్ట్రాల ఎన్నికల తర్వాత 2025లో ఢిల్లీ, బీహార్ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతాయి. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, బీహార్‌లలో ప్రతిపక్షాలు పటిష్టంగా ఒక్కటిగా ఉన్నాయి. ఆయా పార్టీల మధ్య సీట్ల పంపిణీపై ముందుగానే చర్చించి ఒక నిర్ణయానికి రానున్నాయి. ప్రధాని మోదీ ఇప్పటికే జరిగిన తప్పిదాలను గుర్తించి సరిచేసుకునేందుకు రాజకీయ, ప్రభుత్వ స్థాయిల్లో తగిన చర్యలు తీసుకోనున్నారు. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వచ్చే నెలలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 2024-25 బడ్జెట్‌లో ఎన్నికలు జరగనున్న ఆయా రాష్ట్రాలకు సంబంధించి సానుకూల కేటాయింపులు జరిగే అవకాశంఉంది. మోదీ జరిగిన ఎన్నికల్లో నష్టపోయినప్పటికీ తిరిగి పుంజుకునేందుకు రకరకాల ఎత్తుగడలువేసే అవకాశంఉంది. అందువల్ల ఇండియాకూటమి అప్రమత్తంగాఉండాలి. రానున్న మూడు నెలల్లో ఇండియాకూటమికి కీలకమైన కాలం. పార్లమెంటులో ఇతర పార్టీలతో కలిసి గత మోదీ ప్రభుత్వం చేసిన మూడు క్రూరమైన చట్టాలను ఉపసంహరింపచేసేందుకు ప్రతిపక్షం గట్టిగా పోరాడవలసిన అవసరంఉంది. ఈ చట్టాలు జులై 1నుంచి అమలులోకి రానున్నాయి. నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని చర్చకుపెట్టి విజయం పొందాలి. వివిధ సమస్యలు, వ్యవసాయ దుష్టచట్టాలను చర్చకు తీసుకువచ్చి వాటిని కూడా పరిష్కరించవలసి ఉంది. కనీస మద్దతుధరకు చట్టబద్ధమైన హామీకోసం తీవ్ర పోరాటం జరపవలసిందే. ఉద్యోగాలులేని అభివృద్ధికి అనుకూలంగా ఉన్న విధానాలను మార్పించేందుకు తీవ్రమైన పోరాటం చేయవలసిందే.

పదేళ్లుగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

ఏకాభిప్రాయానికి మోదీ వ్యతిరేకం

ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాలరాశారు

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మండిపాటు

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంగళవారం ఎదురుదాడి చేసింది. గత పదేళ్లుగా దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని అమలు చేశారని విమర్శించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'ఎక్స్' వేదికగా మాట్లాడుతూ... ప్రధాని తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గతాన్ని తవ్వుతున్నారు. ఏకాభిప్రాయం, సహకారం గురించి సుద్దులు చెబుతారే గానీ దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత 10 సంవత్సరాల్లో మోదీ 140 కోట్ల మంది భారతీయులకు అప్రకటిత ఎమర్జెన్సీ అంటే చూపించారని... ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి తీవ్ర గాయం చేసిందని పేర్కొన్నారు. 'పార్టీలను చీల్చడం, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడంతో పాటు 95 శాతం మంది ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థల చేత అక్రమ కేసులు పెట్టించడం, ఎన్నికల ముందు ముఖ్యమంత్రులను జైల్లో పెట్టడం... ఇదంతా అప్రకటిత ఎమర్జెన్సీ కాదా' అని ఖర్గే ప్రశ్నించారు. ఎమర్జెన్సీ విధించిన వారికి రాజ్యాంగంపై ప్రేమను చాటుకునే హక్కు లేదని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు ఖర్గే పై విధంగా స్పందించారు. 146 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుండి సస్పెండ్ చేసినప్పుడు, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను మార్చడానికి మూడు కొత్త చట్టాలను తీసుకువచ్చినప్పుడు, ఛత్రపతి శివాజీ, మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుల విగ్రహాలను ఏకపక్షంగా పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి తరలించినప్పుడు ఏకాభిప్రాయం ఎక్కడ ఉందని ఖర్గే ప్రశ్నించారు. 15 కోట్ల రైతు కుటుంబాలపై మూడు కొత్త వ్యవసాయ చట్టాలను బలవంతంగా రుద్దడంతో పాటు నెలరోజుల పాటు రోడ్లపై కూర్చొని నిరసనకు దిగిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడినప్పుడు ఏకాభిప్రాయం ఉందా అంటూ మోదీని నిలదీశారు. ప్రభుత్వ ఏకపక్ష చర్యలకు నోట్ల రద్దు, లాక్‌డౌన్, ఎలక్టోరల్ బాండ్ల చట్టం సహా అనేక ఇతర ఉదాహరణలు ఉన్నాయని ఖర్గే అన్నారు.

ప్రతిపక్షాల గురించి ఏం మాట్లాడాలని, మీ స్వంత నేతలను కూడా చీకట్లో ఉంచారని ఆరోపించారు. 17వ లోక్‌సభలో కేవలం 16 శాతం బిల్లులు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు పంపబడ్డాయని... లోక్‌సభలో తీసుకొచ్చిన 35 శాతం బిల్లులు గంట వ్యవధిలో ఆమోదం పొందగా, రాజ్యసభలో గంట వ్యవధిలో 34 శాతం బిల్లులు ఆమోదం పొందాయని ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విస్మరించిందని... కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి అండగా నిలుస్తుందని, అలాగే కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.

రాజ్యాంగాన్ని మార్చలేనివిధంగా ప్రజల తీర్పు: చిదంబరం

కాంగ్రెస్ సీనియర్ నేత, ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం 'ఎక్స్' వేదికగా మాట్లాడుతూ... రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఏ 'దైవిక పాలకుడూ' మార్చలేని రీతిలో దేశ ప్రజలు 18వ లోక్‌సభకు ఓటు వేశారని అన్నారు. రాజ్యాంగంపై బీజేపీ కుట్రలు అమలవకుండా చేసే విధంగా ప్రజలు ఓటు వేశారని అన్నారు. 'రాజ్యాంగాన్ని రక్షించాలని ఎమర్జెన్సీ గుర్తుచేస్తుంది' అని పధానమంత్రి అనడంలో నిజముందని చిదంబరం చెబుతూ... మరో ఎమర్జెన్సీని నివారించాలని రాజ్యాంగం ప్రజలకు గుర్తు చేసిందన్నారు. ప్రజలు బీజేపీ దుష్ట ఆలోచనలకు గండి కొడుతూ 18వ లోక్‌సభకు ఓటు వేశారన్నారు. ఎవరూ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని మార్చలేరన్నారు. 'భారతదేశం ఉదారవాద, ప్రజాస్వామ్య, లౌకిక రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుంది' అని స్పష్టం చేశారు.

సీక్రెట్ బ్యాలెట్‌తో స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో దశాబ్దాలుగా కొనసాగుతోన్న సంప్రదాయానికి తెరపడింది. స్వతంత్ర భారత చరిత్రలో స్పీకర్ ఎన్నికకు మూడోసారి ఓటింగ్ అనివార్యమైంది. కొన్నిసార్లు మినహా దశాబ్దాలుగా స్పీకర్ పదవిని అధికార పక్షం చేపట్టగా... విపక్షాలు డిప్యూటీ స్పీకర్ పదవి చేపట్టే ప్రక్రియ కొనసాగుతోంది. కాగా, స్పీకర్ ఎన్నిక సీక్రెట్ బ్యాలెట్ విధానంతోనే జరుగుతోంది. స్పీకర్ ఎన్నిక నిర్వహణకు ఎటువంటి కాల వ్యవధి లేదు. అయితే... కొత్త లోక్‌సభ కొలువుదీరిన అనంతరం సాధ్యమైనంత త్వరగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకోవాలని రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 93' చెబుతోంది. సాధారణ మెజార్టీతోనే స్పీకర్‌ను ఎన్నుకుంటారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎంపీలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలైన మొత్తం ఓట్లలో ఏ అభ్యర్థి సగానికి పైగా ఓట్లు పొందుతారో ఆయనే స్పీకర్‌గా ఎన్నికవుతారు. లోక్‌సభలో సభ్యుడిగా ఉన్న ఎవరైనా ఈ పదవికి పోటీ చేయవచ్చు. ప్రత్యేక అర్హతలు అవసరం లేదు. కేవలం సభలో సభ్యుడు/సభ్యురాలిగా ఉంటే చాలు. సీనియారిటీ, నిష్పాక్షికత వంటి ముఖ్య అంశాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను నిలబెడతారు. అనర్హత లేదా అవిశ్వాస ప్రక్రియ ద్వారా స్పీకర్‌ను ఆ పదవి నుంచి తొలగించవచ్చు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 ప్రకారం నోటీసులు ఇచ్చిన 14 రోజుల తర్వాతే అటువంటి తీర్మానం ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడంలో స్పీకర్‌దే కీలక పాత్ర. సభను ఆర్డర్‌లో ఉంచడం, సభా గౌరవాన్ని కాపాడటంతోపాటు సమావేశాల అజెండా, వాయిదా, అవిశ్వాస తీర్మానాలు అనుమతించే బాధ్యత ఆయనదే. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం సభ నియమాలను ఉల్లంఘించిన సభ్యులపై చర్యలు తీసుకునే, అనర్హత విధించే అధికారం స్పీకర్‌కు ఉంటుంది. సభా నియమాలు పాటిస్తూనే వాటిని స్పీకర్ అమలుచేయాల్సి ఉంటుంది. ఆయన నిర్ణయాలను సవాలు చేయలేరు. లోక్‌సభలో సభ్యుడు/సభ్యురాలు అయినప్పటికీ... సభాపతిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గత రెండుసార్లు సంపూర్ణ మెజార్టీతో ప్రభుత్వాన్ని కొనసాగించిన బీజేపీ... ఈసారి మాత్రం మెజార్టీ మార్కుకు 32 సీట్లు తక్కువ కావడంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ఎన్డీయేకు 293 మంది సభ్యులు, విపక్ష ఇండియా ఐక్య సంఘటనకు 234 మంది ఎంపీలున్నారు. తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా స్పీకర్ ఎన్నిక కీలకంగా మారింది. అధికార పక్షం నుంచి ఓం బిర్లా నామినేషన్ వేయగా... ఇండియా ఐక్యసంఘటన నుంచి కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ బరిలో నిలిచారు. ఎవరూ నామినేషన్ వెనక్కి తీసుకోకపోతే జూన్ 26న ఉదయం 11 గంటలకు స్పీకర్ పదవికి ఎన్నిక నిర్వహిస్తారు.

ఆ గుర్తులతో నష్టపోయాం... తొలగించండి

ఈసీకి ఎన్సీపీ(ఎస్పీ) అభ్యర్థన

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ భారత ఎన్నికల సంఘానికి కీలక అభ్యర్థన చేసింది. పార్టీకి అధికారికంగా కేటాయించిన 'బూర వాయించే వ్యక్తి' చిహ్నాన్ని పోలిన మరికొన్ని గుర్తులను ఉపసంహరించాలని లేదా మినహాయించాలని అభ్యర్థించింది. స్వతంత్ర అభ్యర్థులకు తమ పార్టీ గుర్తును పోలి ఉన్న "ట్రంపెట్/ట్యుటారీ" వంటి చిహ్నాలను కేటాయించడం వలన పార్టీకి ప్రతికూలత ఏర్పడిందని తెలిపింది. ఇది స్థాయిని సృష్టించే సూత్రానికి విరుద్ధంగా ఉందని పేర్కొంది. స్వతంత్ర అభ్యర్థులకు 'ట్రంపెట్' గుర్తును కేటాయించడం సముచితం కాదని చెబుతూ... ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఇలాంటి గుర్తులు ఓటర్లను గందరగోళానికి గురిచేసిన సందర్భాలను ఉదహరించింది. సుమారు తొమ్మిది నియోజకవర్గాల్లో పార్టీ విజయావకాశాలను ప్రభావితం చేసిందని వివరించింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమి పక్షంగా పోటీచేసిన శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ... పోటీ చేసిన పది స్థానాల్లో 8 స్థానాలను గెలుచుకుంది. సతారా స్థానం నుంచి ట్రంపెట్ గుర్తుపై పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి సంజయ్ గాడే స్వల్ప తేడాతో తమ అభ్యర్థి శశికాంత్ షిండే ఓటమికి కారణమయ్యారని పార్టీ ఉదాహరణగా పేర్కొంది. ఎన్సీపీలో చీలిక ఏర్పడిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎన్సీపీ (ఎస్పీ)కి ఎన్నికల సంఘం 'బూర వాయించే వ్యక్తి' గుర్తును కేటాయించిన సంగతి విదితమే. ఈ ఏడాది అక్టోబరులో మహారాష్ట్రలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఉచిత చిహ్నాల జాబితా నుండి ట్రంపెట్/ట్యుటారి చిహ్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేదా మినహాయించాలని ఎన్సీపీ (ఎస్పీ) ఈసీని అభ్యర్థించింది.

మంత్రి అతిశీ ఆమరణ దీక్ష విరమణ

న్యూఢిల్లీ: ఢిల్లీ నీటి శాఖ మంత్రి అతిశీ తన అమరణ నిరాహార దీక్ష విరమించారు. తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం తెల్లవారుజుమున ఆమె స్థానిక లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ (ఎల్ఎన్‌జేపీ)ఆసుపత్రిలో చేరారు. మంత్రి అతిశీ షుగర్ లెవెల్స్ 36కి పడిపోయాయని, దీంతో ఆమెను ఆసుపత్రికి తరలించామని ఆమ్ ఆద్మీ పార్టీ వెల్లడించింది. ఢిల్లీలో మంచి నీటి సరఫరా డిమాండ్ చేస్తూ మంత్రి అతిశీ అయిదు రోజులుగా అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆ క్రమంలో ఆమె ఆరోగ్యం క్షీణించింది. దీంతో సోమవారం రాత్రి వైద్యులు ఆమెను పరీక్షించారు. ఆరోగ్యం బాగా క్షీణించిందని, వెంటనే ఆసుపత్రిలో చేరాలని మంత్రి అతిశీకి వైద్యులు సూచించారు. లేకుంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశముందన్నారు. దాంతో మంగళవారం తెల్లవారుజామున మంత్రి అతిశి... తన దీక్ష విరమించారు. అనంతరం ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో ఉన్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. హర్యానా నుంచి ఢిల్లీకి చట్టబద్ధంగా రావాల్సిన నీటిని విడుదల చేయాలంటూ మంత్రి అతిశి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు ఢిల్లీలో మంచి నీటి కొరతపై ప్రధాని మోదీకి లేఖ రాస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీలో మంచి నీటి కొరత అంశాన్ని విపక్షాలతో కలిసి పార్లమెంట్‌లో లెవనెత్తుతామని ఆయన స్పష్టం చేశారు.

నీట్' రద్దు చేయండి

మోదీకి మమత విజ్ఞప్తి

కోల్‌కతా: నీట్ పరీక్షను పూర్తిగా రద్దుచేయాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోరారు. ప్రశ్నపత్రం లీకేజీపై సమగ్ర నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోదీకి ఆమె లేఖ రాశారు. నీట్‌ను రద్దు చేసి... ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులను ఎంపిక చేసే స్వేచ్ఛను రాష్ట్రాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధానిని కోరారు. తక్షణమే పాత పద్ధతి పునరుద్ధరించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. కాగా, భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాలకు సంబంధించి రెండు దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనా మధ్య జరిగిన చర్చలకు కేంద్రం తనను ఆహ్వానించకపోవడంపై మమతా బెనర్జీ మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ప్రమేయం లేకుండా రెండు దేశాలు నీటి పంపకాలపై చర్చలు జరపడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా, అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చర్చలు, సంప్రదింపులు జరపడం ఆమోదయోగ్యం కాదు' అని మమత పేర్కొన్నారు. తీస్తా నదీ జలాల పరిరక్షణ-నిర్వహణ, 1996 నాటి గంగా జలాల ఒప్పందం పునరుద్ధరణ అంశాలపై ఇటీవల మోదీ, హసీనా చర్చలు జరిపారు. అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ త్వరలో సాంకేతిక బృందాన్ని బంగ్లాదేశ్‌కు పంపనున్నట్టు తెలిపారు. ఒప్పందం ప్రకారం తీస్తా జలాల పరిరక్షణ, నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద రిజర్వాయరు నిర్మించడానికి భారత్ సిద్ధంగా ఉంది. అయితే భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాల ఒప్పందాన్ని చాలాకాలంగా మమత వ్యతిరేకిస్తున్నారు.

ఒవైసీ వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగింపు



న్యూఢిల్లీ : ఏఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ మంగళవారం లోక్‌సభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సంఘర్షణతో బాధపడుతున్న పశ్చిమాసియా ప్రాంత వివాదం గురించి ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలు అధికార పక్షం నుంచి నిరసనకు దారితీశాయి. దీంతో ఒవైసీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. హైదరాబాద్ నుంచి ఐదోసారి ఎన్నికయిన ఒవైసీ ఉర్దూలో ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు ప్రార్థన కూడా చదివారు. తన ప్రమాణం తర్వాత, అతను ముస్లింల కోసం ఏఐఎంఐఎంకు చెందిన నినాదాన్ని లేవనెత్తడమే కాకుండా, తన రాష్ట్రమైన తెలంగాణ, బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్‌ను కీర్తించారు. ప్రస్తుతం వివాదాన్ని ఎదుర్కొంటున్న పశ్చిమాసియా ప్రాంతాన్ని కూడా ఒవైసీ కొనియాడారు. దీనిపై అధికార పక్షానికి చెందిన కొందరు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన ప్రమాణం ముగించిన తర్వాత సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. ప్రమాణ స్వీకారం తప్ప మరేదీ రికార్డుల్లోకి రాదని ఆ సమయంలో చైర్‌లో ఉన్న రాధామోహన్ సింగ్ సభ్యులకు హామీ ఇచ్చారు. కొన్ని నిమిషాల పాటు గందరగోళం కొనసాగింది. ఆ తర్వాత ప్రమాణ స్వీకారం మళ్లీ ప్రారంభమైంది. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ త్వరలో సభకు తిరిగి వచ్చారు. ప్రమాణం లేదా ధృవీకరణ మాత్రమే నమోదవుతుందని చెప్పారు. పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడిన ఒవైసీ... 'జై పాలస్తీనా' అని అన్నారు. 'ఇతర సభ్యులు కూడా రకరకాలుగా మాట్లాడుతున్నారు. నేను జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అని అన్నాను.. అది ఎలా తప్పో... రాజ్యాంగం ఏంటో చెప్పండి. మీరు కూడా ఎదుటివారు చెప్పేది వినండి... అన్నాను. పాలస్తీనా గురించి మహాత్మా గాంధీ ఏమి చెప్పారో చదవండి' అని తెలిపారు. పాలస్తీనా గురించి ఎందుకు ప్రస్తావించారని ప్రశ్నించగా, వారు అణగారిన ప్రజలు అని అన్నారు.

ప్రజ్వల్‌పై మరో ఎఫ్ఐఆర్

పోలీసు కస్టడీ నాలుగు రోజులు పొడిగింపు

బెంగళూరు : మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపులు, వేధింపులు, బెదిరింపుల ఆరోపణలపై మరో ఎఫ్ఐఆర్ నమోదయినట్లు పోలీసు వర్గాలు మంగళవారం తెలిపాయి. అలాగే అతని పోలీసు కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించారు. బాధితురాలిపై లైంగిక వేధింపుల సమయంలో ప్రజ్వల్ తీసిన చిత్రాలను వీడియో కాల్‌లో పంచుకున్నందుకు అతనితో పాటు హసన్‌లోని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్ గౌడ్‌తో సహా మరో ముగ్గురిని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు వారు తెలిపారు. తాజా ఎఫ్ఐఆర్‌తో ప్రజ్వల్‌పై నమోదయిన నాలుగో కేసు ఇది. 'ప్రజ్వల్, మరో ముగ్గురిపై సిట్ తాజా కేసు నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్ గౌడ పేరు కూడా ఉంది' అని పోలీసు వర్గాలు ధ్రువీకరించినట్లు పీటీఐ తెలిపింది. భారత నేర శిక్షాస్మృతిలోని సెక్షన్‌లు 355 ఎ (లైంగిక వేధింపులు), 354 బి (మహిళపై దాడి చేయడం), 354 సి (వెంబడించడం), 506 (నేరపూరిత బెదిరింపు), 66 ఇ (గోప్యతను ఉల్లంఘించినందుకు శిక్ష) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా, ప్రజ్వల్ రేవణ్ణ పోలీసు కస్టడీని జూన్ 29 వరకు నాలుగు రోజుల పాటు పొడిగించారు. ప్రజ్వల్ అనేక మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, అసభ్యకరమైన వీడియోలు తీశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. బాధితుల వీడియోల రికార్డు కోసం సీఐడీ సైబర్ క్రైమ్ కేసులో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు ప్రజ్వల్‌కు జూన్ 29 వరకు పోలీసు కస్టడీని పొడిగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 33 ఏళ్ల ప్రజ్వల్ జర్మనీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే మే 31న అరెస్టయ్యాడు. ప్రజ్వల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని కర్నాటక పోలీసులు విచారణ చేపట్టారు.

ఒంటెపై పార్లమెంట్‌కు ఎంపీ

అడ్డుకున్న సిబ్బంది

న్యూఢిల్లీ: ప్రమాణస్వీకార సమయంలో తమ ప్రాంత సంప్రదాయాలు, భాషకు పెద్దపీట వేసేందుకు చాలామంది నాయకులు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలోనే పార్లమెంట్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి తాజాగా ఎంపీలుగా ప్రమాణం చేసిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు తెలుగుదనం ఉట్టిపడే వస్త్రధారణతో అచ్చ తెలుగులో ప్రమాణం చేశారు.

విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఢిల్లీలోని తన నివాసం నుంచి సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ తరహాలోనే రాజస్థాన్‌కు చెందిన భారత్ ఆదివాసీ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ రాజ్‌కుమార్ రోత్ ప్రమాణస్వీకారానికి ఒంటెపై పార్లమెంట్‌కు వచ్చారు. అయితే, పార్లమెంట్ పరిసరాల్లోకి రాగానే ఆయనను భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఒంటెను ఇంతకంటే ముందుకు అనుమతించడం కుదరదని చెప్పారు. సిబ్బంది తీరుపై ఎంపీ అసహనం వ్యక్తంచేశారు. గతంలో మూడుసార్లు ప్రధానిగా చేసిన వాజ్‌పేయి ఎద్దుల బండిలో పార్లమెంట్‌కు వస్తే తప్పులేదు కానీ...తాను ఒంటెపై వస్తే తప్పేమిటని నిలదీశారు. దీనిపై పార్లమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కాంగ్రెస్ మద్దతుతో బాన్స్‌వారా లోక్‌సభ స్థానం నుంచి ఆయన విజయం సాధించారు.

ఆగస్టులో తొలి వందే భారత్ స్లీపర్

న్యూఢిల్లీ: దేశంలో మొట్టమొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. స్లీపర్ రైలును అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వందే భారత్ రైళ్లు చైర్‌కార్ సర్వీసులు మాత్రమే అందిస్తున్నాయి. స్లీపర్ ట్రైన్‌ను మరో రెండు నెలల్లో అంటే ఆగస్టు 15 నాటికి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్లీపర్ రైలు పనులు పర్యవేక్షించడానికి బెంగళూరు వెళ్లారు. వందేభారత్ స్లీపర్ రైలు తయారీ చివరిదశలో ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు ఢిల్లీ, ముంబై రైల్వే మార్గంలో నడుస్తుందని, రద్దీగా ఉండే ఈ మార్గంలో స్లీపర్ రైలును అందుబాటులోకి తీసుకువస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. స్లీపర్ ట్రైన్ ఢిల్లీ నుంచి భోపాల్, సూరత్ మీదుగా ముంబై చేరుకుంటుందని తెలిపాయి. త్వరలో పట్టాలెక్కనున్న ఈ స్లీపర్ రైల్లో మొత్తం 16 బోగీలు ఉంటాయని, అందులో 10 థర్డ్ ఏసీకి, 4 సెకండ్ ఏసీకి, ఒక బోగీ ఫస్ట్ ఏసీకి కేటాయించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలులో సీటింగ్‌తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అందుబాటులో ఉంటాయి. గంటకు 130 కి.మీ. వేగంతో నడిచే ఈ రైలు వేగాన్ని కొద్ది రోజుల అనంతరం క్రమంగా గంటకు 160-220 కి.మీ.లకు పెంచనున్నారు.

ఎమర్జెన్సీపై మోదీ పోరాడలేదు: సుబ్రమణ్యస్వామి



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర మాజీమంత్రి, బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి కొంతకాలంగా విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అప్పట్లో విధించిన ఎమర్జెన్సీ గురించి మోదీ మాట్లాడటంపై ఆయన స్పందించారు. 'ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా మోదీ పోరాడలేదు. ఆ సమయంలో ఆయన గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉన్నారు. బాబుభాయ్ నేతృత్వంలోని జనతా మోర్చా సర్కార్ గుజరాత్‌లో ఉన్న కారణంగా రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు రాలేదు. ఇలాంటి అంశాల్లో క్రెడిట్ కొట్టేయాలనే ఓ చెడ్డ అలవాటు మోదీకి ఉంది' అని సుబ్రహ్మణ్య స్వామి ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. దేశ వ్యాప్తంగా నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ సంచలనం సృష్టిస్తున్న వేళ సుబ్రమణ్య స్వామి బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'పార్లమెంటులో మెజారిటీ లేని ప్రభుత్వం ఉంది. దేశంలో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. ఎవరు గెలిచినా విద్యార్థుల కష్టాలు పట్టించుకోరు. పిల్లల జీవితాలతో ఆడుకోవడం, వారి కలలు నాశనం చేయడమే వారి పని' అని సుబ్రమణ్య స్వామి తీవ్రంగా స్పందించారు.

డిజైన్ సమస్యలు లేవు: నృపేంద్ర మిశ్ర

అయోధ్య: అయోధ్య రామమందిరం గర్భగుడిలోకి పైకప్పు నుంచి నీరు కారుతున్నట్టు ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ చెప్పడంపై ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర స్పందించారు. లీకేజీ నిజమేనని అంగీకరించిన ఆయన...దీనికి డిజైన్ సమస్యలు కారణం కాదని తెలిపారు. 'ప్రస్తుతం నేను అయోధ్యలోనే ఉన్నాను. మొదటి అంతస్తు నుంచి వర్షం నీరు కారడాన్ని చూశాను. గురుమండపం నుంచి ఆకాశం కనిపిస్తుంది. శిఖర నిర్మాణం పూర్తయితే అది కవర్ అవుతుంది. ప్రస్తుతం మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో పురోగతి ఉంది. ఒకసారి ఆ పనులు పూర్తయితే అక్కడి పైపులు అన్నీ మూసివేస్తాం. గర్భగుడిలో ఎలాంటి డ్రైనేజీ తరహా నిర్మాణం లేదు' అని చెప్పారు. మొత్తం ఆలయ నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. శనివారం రాత్రి భారీ వర్షం పడటంతో లీకేజీ సమస్య బయటపడిందని, నీరు సరిగ్గా రామ్‌లల్లా విగ్రహానికి ఎదురుగా పూజారి కూర్చునే, వీఐపీలు దర్శనం చేసుకునే చోట కారుతోందని సత్యేంద్రదాస్ పేర్కొన్నారు. ఆలయ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆలయ ప్రాంగణం నుంచి వర్షపు నీరు పోయేందుకూ సరైన ఏర్పాట్లు లేవని, ఈ సమస్యపై ఆలయ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తమిళ ఎంపీ తెలుగులో ప్రమాణం

న్యూఢిల్లీ: లోక్‌సభలో ఎంపీల ప్రమాణస్వీకారం సందర్భంగా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. తమిళనాడు నుంచి ఎంపీగా గెలుపొందిన కె.గోపీనాథ్ తెలుగులో ప్రమాణస్వీకారం చేసి అందరి దృష్టి ఆకర్షించారు. కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించిన ఆయన... రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. చివరలో జై తమిళనాడు అని నినాదం చేశారు. గతంలో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికైన సమయంలోనూ ఆయన తెలుగులోనే ప్రమాణస్వీకారం చేశారు. అంతేకాకుండా అనేక అంశాలపై తెలుగులోనే అడగ్గా... అప్పటి ముఖ్యమంత్రి జయలలిత తెలుగులోనే సమాధానాలు ఇచ్చారు.

మహారాష్ట్రకు చెందిన చాలామంది సభ్యులు మంగళవారం ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ భర్తృహరి కాళ్లకు నమస్కరించారు. అనంతరం బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశీస్సులు తీసుకున్నారు. మహారాష్ట్ర ఎంపీలు ప్రమాణస్వీకారం తర్వాత జైహింద్, జై మహారాష్ట్ర, జైభీం, జై శివాజీ అంటూ నినాదాలు చేయగా... ప్రమాణస్వీకార పత్రంలో ఏముందో అదే చెప్పాలని ప్రొటెం స్పీకర్ సభ్యులకు సూచించారు.

మంత్రులు ఆదాయ పన్ను చెల్లించాల్సిందే

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆదేశం



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని బీజేపీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మంత్రులు ఇకపై సొంతంగా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందేనని సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తూ వస్తోంది. 1972 నుంచి ఈ నిబంధన అమల్లో ఉంది. మంత్రులకు చెల్లించే జీతం, ఇతర భత్యాలపై రాష్ట్ర ప్రభుత్వమే వారి తరఫున ఆదాయపు పన్ను చెల్లిస్తోంది. దాదాపు 52 ఏళ్ల తర్వాత ఈ నిబంధనకు కేబినెట్ చరమగీతం పాడింది. కేబినెట్ సమావేశంలో మంత్రి కైలాశ్ విజయ వర్గీయ ఈ అంశాన్ని లేవనెత్తగా... మంత్రులు సొంతంగానే ఆదాయపు పన్ను చెల్లించాలని సీఎం మోహన్ యాదవ్ సూచించారు. ఇందుకు కేబినెట్‌లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మధ్యప్రదేశ్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంత్రులు, అధికారులు సొంతంగానే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అసోంలోని హిమంత విశ్వశర్మ సర్కారు నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే మధ్యప్రదేశ్ సర్కారు నుంచి ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం.

చరిత్ర సృష్టించిన చైనా

జాబిల్లికి ఆవలివైపు మట్టి తెచ్చిన చాంగే-6



బీజింగ్:
చంద్ర మండల యాత్రల్లో చైనా మరో అద్భుత ఘనత సాధించింది. ప్రపంచ చరిత్రలో తొలిసారి జాబిల్లికి ఆవలివైపు నమూనాలు సేకరించి... వాటిని విజయవంతంగా భూమి మీదకు తీసుకొచ్చింది. చంద్రుడి రెండోవైపు నుంచి మట్టి, శిథిలాలు మోసుకొని లూనార్ ల్యాండర్ చాంగే-6 వ్యోమనౌక మంగళవారం భూమిని చేరుకుంది. ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియన్ ప్రాంతంలో ఇది సురక్షితంగా దిగినట్లు చైనా వెల్లడించింది. మే 3వ తేదీన చాంగే-6 నింగికెగిరింది. దాదాపు 53 రోజులపాటు ప్రయాణించి జాబిల్లిని చేరింది. జూన్ 2న జాబిల్లి ఆవలివైపున సౌత్ పోల్-అయిట్కిన్ ప్రాంతంలో ఉన్న అపోలో బేసిన్‌లో సురక్షితంగా చంద్రుడి ఉపరితలాన్ని తాకింది. ఈ మిషన్‌లో ఆర్బిటర్, ల్యాండర్, అసెండర్, రిటర్నర్ అనే నాలుగు భాగాలు ఉన్నాయి. జాబిల్లి ఉపరితలంపై ఉన్న నమూనాలను రోబోటిక్ చేతి సాయంతో సేకరించింది. డ్రిల్లింగ్ యంత్రాన్ని ఉపయోగించి దిగువనున్న ప్రాంతం నుంచి మట్టి తీసుకుంది. అనంతరం వాటిని తీసుకుని భూమికి వచ్చేసింది. చాంగే-6 తీసుకొచ్చిన నమూనాల్లో 2.5 మిలియన్ సంవత్సరాల పురాతన అగ్నిపర్వత శిలలు కూడా ఉండొచ్చని చైనా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ నమూనాలను అధ్యయనం చేస్తే చంద్రుడికి రెండు వైపులా ఉన్న భౌగోళిక వ్యత్యాసాలకు సంబంధించి అనేక ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందని భావిస్తున్నారు. చందమామకు సంబంధించిన ఒక భాగం మాత్రమే భూమి నుంచి కనిపిస్తుంది. ఇప్పటివరకు అమెరికా, సోవియెట్ యూనియన్‌తో పాటు చైనా కూడా చాలామార్లు నియర్ సైడ్ నుంచి నమూనాలు సేకరించి భూమికి తీసుకొచ్చాయి. అవతలి భాగం నుంచి మట్టి, శిథిలాలు తీసుకురావడం ఇదే తొలిసారి. చంద్రుడి రెండు ప్రాంతాలు పూర్తిగా భిన్నమని రిమోట్ సెన్సింగ్ పరిశీలనల్లో వెల్లడైంది. ఇవతలి భాగం ఒకింత చదునుగా ఉంటుంది. అవతలి ప్రాంతం అంతరిక్ష శిలలు ఢీకొట్టడం వల్ల ఏర్పడిన బిలాలతో నిండిపోయి ఉంటుంది. చంద్రుడి ఉపరితల మందం కూడా రెండు భాగాల్లో భిన్న రీతుల్లో ఉన్నట్లు వెల్లడైంది.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

న్యూఢిల్లీ:
మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో బెయిల్‌పై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించలేదు. ట్రయల్ కోర్టు మంజూరుచేసిన బెయిల్‌పై హైకోర్టు స్టే విధించింది. ఈడీ సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకోవడంలో ట్రయల్ కోర్టు విఫలమైందని, బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేటప్పుడు పూర్తిస్థాయిలో ఆలోచన చేయలేదని పేర్కొంది. బెయిల్‌పై విచారణ సమయంలో ఈడీకి తగిన అవకాశం ఇవ్వాల్సిందని చెప్పింది. దీంతో కేజ్రీవాల్ ప్రస్తుతానికి తీహార్ జైలుకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు సాధారణ బెయిల్ మంజూరుచేస్తూ ట్రయల్ కోర్టు గురువారం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే... ట్రయల్ కోర్టు తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపిస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. దీన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. అయితే... హైకోర్టు నిర్ణయం వెలువడ్డాకే తమ తీర్పు ఉంటుందని, అప్పటివరకు వేచి ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం సోమ వారం సూచించింది. జూన్ 26న దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.

సీఎస్‌కు ఎస్టీ కమిషన్ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జగన్ ప్రభుత్వ హయాంలో ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్... పోలవరం నిర్వాసితుల పునరావాసం విషయంలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి తీసుకున్న చర్యలపై వివరణ ఇవ్వాలంటూ ప్రస్తుత సీఎస్‌ను కమిషన్ ఆదేశించింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా తమ ఎదుట హాజరై పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొంది. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పూర్తిగా నిర్లక్ష్యంగా చేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై స్పందించిన విశాఖకు చెందిన న్యాయవాది రమేశ్ చంద్ర వర్మ, పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పించకపోవడంపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్ వివరణ ఇవ్వాలంటూ సీఎస్ నీరబ్ కుమార్‌ను ఆదేశించింది. జగన్ హయాంలో ప్రాజెక్టు పనులు ఒక్క అడుగూ ముందుకు సాగలేదు. కనీసం భూములు కోల్పోయిన వారి బాధలు కూడా పట్టించుకోలేదు. దీనిపై వారు ఎన్నిసార్లు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రమేశ్ చంద్రవర్మ బాధితులకు అండగా ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. నిర్వాసితులను ఆదుకోవడంపై చేపట్టిన చర్యలపై వివరణ ఇవ్వాలంటూ తాజాగా ఎస్టీ కమిషన్ సీఎస్‌ను ఆదేశించింది.

'టెట్'లో 50 శాతమే ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన విద్యామంత్రి లోకేశ్
- మరో టెట్ నిర్వహిస్తామని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) 2024-ఫిబ్రవరి పరీక్షా ఫలితాల్లో 50.04శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ టెట్ పరీక్షలను ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6వరకు నిర్వహించారు. ఎన్నికల కోడ్‌తో వాటి ఫలితాలను ఈసీ నిలిపివేసింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఏపీ టెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం విడుదల చేశారు. ఏపీ టెట్‌కు మొత్తం 2,67,789 మంది దరఖాస్తు చేయగా... వారిలో 2,35,907 మంది పరీక్ష రాశారు. మొత్తం 1,37,904 మంది అర్హత (58.04 శాతం)సాధించారు. పేపర్ 1(ఏ) (ఎస్జీటీ రెగ్యులర్‌కు)కు 1,13,296 మంది హాజరుకాగా, 78,142 మంది (66.32శాతం) అర్హత పొందారు. పేపర్ 1బి (ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్)కు 1700 మంది దరఖాస్తు చేసుకోగా, 790 మంది (46.47శాతం) అర్హత సాధించారు. పేర్ 2ఏ (ఎస్ఏ రెగ్యులర్)కు 1,19,500 మంది హాజరుకావాగా, వారిలో 60,846 మంది (50.96శాతం) అర్హత పొందారు. పేపర్ 2బి (ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్)కు 1,411 మంది హాజరుకాగా, 1,125 మంది (79.73శాతం) అర్హత సాధించారు. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీకి దరఖాస్తు చేసేలా నిబంధన ఉంది. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పించారు. టెట్ వెయిటేజీ+డీఎస్సీ మార్పులను కలిపి, ర్యాంకులు, కేటగిరీల వారీగా ప్రతిభా జాబితాను రూపొందించి ఎంపిక ప్రక్రియ ఉంటుంది. దీంతో డీఎస్సీ తరహాగానే, టెట్‌కూ అభ్యర్థులు పోటీపడీ మరి రాస్తున్నారు. టెట్‌లో అర్హత సాధించిన వారు తమకు వచ్చిన వెయిటేజీ మార్కులు సరిగ్గా లేకుంటే, వాటిని పెంచుకునేందుకు మళ్లీ రాసుకోవచ్చు. విద్యాహక్కు చట్టం ఆధారంగా ప్రతి ఆర్నెల్లకోసారి టెట్ నిర్వహించాలన్న నిబంధన ఉంది. గత ప్రభుత్వాలు ఆ తరహాగా టెట్‌ను నిర్వహించ లేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత టెట్ ఫలితాలను విడుదల చేసింది. గత టెట్‌లో అర్హత సాధించని వారి కోసం మరో టెట్ నోటిఫికేషన్ నిర్వహిస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంతో నిరుద్యోగులు ఊరట చెందుతున్నారు. కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసిన వారికి ఈ టెట్ రాసుకునే వెసులుబాటు రానుంది. అనంతరం ప్రభుత్వం డీఎస్సీ 2024 నోటిఫికేషన్ జారీచేయనుంది. ఏపీ టెట్ ఫిబ్రవరి-2024 వెబ్ సైట్‌లోకి వెళ్లి అభ్యర్థుల దరఖాస్తు ఐడీ, వెరిఫికికేషన్ కోడ్, పుట్టిన తేదీ నమోదు చేయడం ద్వారా ఫలితాలను పొందవచ్చు.

అభ్యర్థులు నిరాశ చెందొద్దు...
టెట్‌లో అర్హత సాధించని అభ్యర్థులు నిరుత్సాహ పడవద్దని, త్వరలోనే మరో టెట్ నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. టెట్‌లో అర్హత సాధించిన వారికి ఆయన 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అర్హత సాధించని వారంతా కొత్తగా బీఈడీ, డీఎడ్ పాసైన అభ్యర్థులతోపాటు త్వరలోనే నిర్వహించబోయే టెట్‌కు, డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి సేద్య కార్యకర్తలకు

వేతనాల చెల్లింపు

ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
పశ్చిమగోదావరి జిల్లాలో ప్రకృతి సేద్య విభాగంలో కార్యకర్తలుగా పనిచేస్తున్నవారికి ప్రభుత్వం ఈనెల 26వ తేదీన బ్యాంకుల ద్వారా ఒక నెల వేతనం అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆర్‌వైఎస్ఎస్ సీఈవో రామారావు తమకు తెలియజేశారన్నారు. కార్యకర్తల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమచేసే ఈ ప్రక్రియ విజయవంతమైతే అన్ని జిల్లాల కార్యకర్తలకు వరుస క్రమంలో గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు. 17 నెలలుగా వేతన చెల్లింపులు జరగక ప్రకృతి సేద్య కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు, మనస్థాపానికి గురయ్యారని వివరించారు. ఆర్‌వైఎస్ఎస్ విభాగం ఉన్నతాధికారుల కృషి మేరకు వేతన చెల్లింపుల పక్రియ ప్రారంభించడంపై ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం తరపున కేవీవీ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

కుట్రతోనే జగన్ భద్రత తగ్గింపు

మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి భద్రత తగ్గించారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు 196 మంది పోలీసులే భద్రతగా ఉన్నారని చెప్పారు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆయనతో పాటు లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మిణి, దేవాన్ష్‌కు భద్రత ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో 13 కిలోమీటర్ల మేర రోడ్డును మూసేశారని గుర్తుచేశారు. నాడు భద్రత గురించి అయినందునే ఎవ్వరూ పట్టించుకోలేదని, నేడు జగన్ భద్రతపై ఇంత విష ప్రచారం ఎందుకు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు ఇంటి ఫోటోలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి జగన్ నివాసం, మీ నివాసంలో ఏమున్నాయనేదీ నిపుణులతో ఖరీదు కట్టగలరా అని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ భూములను లీజుకు ఇచ్చే జీవోలను టీడీపీ ప్రభుత్వ హయాం నుంచే తెచ్చారన్నారు. నాడు స్థలాలను లీజుకు తీసుకుని... టీడీపీ కార్యాలయాలను కట్టలేదా? అని ప్రశ్నించారు. వైసీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నాడు తప్పుడు కేసులు పెట్టినా భయపడని జగన్.. మీకు భయపడతారా? అని ప్రశ్నించారు. దేశంలోనే అతిపెద్ద పార్టీ వైసీపీ అని, తాడేపల్లి నుంచే జగన్ పార్టీని నడుపుతారని స్పష్టం చేశారు. మళ్లీ గెలిచేంత వరకు తాడేపల్లి నుంచే పోరాటాలు చేస్తామన్నారు. చంద్రబాబు, లోకేశ్ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు నడుపుతున్నారని, ప్రతిరోజూ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు తమ అనుకూల మీడియాతో విష ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్‌తో సహా ఇచ్చిన హామీల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ తరహాగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

రామోజీ సంస్మరణ సభ ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఈనెల 27వ తేదీ గురువారం సాయంత్రం 4గంటలకు విజయవాడ సమీపంలోని కానూరు 100 అడుగుల రోడ్డు సమీప స్థలంలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ జరగనుంది. ఈ సభ ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, సమాచార మంత్రి కె.పార్థసారథి, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్యారోగ్య మంత్రి సత్య కుమార్ యాదవ్, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తోకూడిన మంత్రుల బృందం అధికారులతో సమీక్షించింది. ఈసందర్భంగా వివిధ శాఖల వారీగా చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు సహా కేంద్ర మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సినీ, పత్రికా, మీడియా, వ్యాపార, వాణిజ్య తదితర రంగాలకు చెందిన ప్రముఖులు సుమారు 7వేల మందికి పైగా ఈ సభకు హాజరు కానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్నివిజయ వంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ జి.సంపత్ కుమార్ ఏర్పాట్ల గురించి మంత్రులకు వివరించారు. ముఖ్యంగా ప్రధాన వేదిక, హాజరు కానున్న ప్రముఖులకు సంబంధించి చేస్తున్న వసతి, రవాణా తదితర అంశాలపై వివరించారు.

జీవో 2430 రద్దు చేయాలి...

జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలి

ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్):
మీడియాను బెదిరించేందుకు గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 2430ను వెంటనే రద్దు చేయాలని, గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో జర్నలిస్టులపై నమోదు చేసిన కేసులను తక్షణం ఎత్తివేయాలని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమా వేశం మంగళవారం విజయవాడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమ అగ్ర నేత కీ.శే. అంబటి ఆంజనేయులు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని యూనియన్ నాయకులు, సభ్యులు అంబటికి నివాళులు అర్పించారు. అంబటి చిత్ర పటానికి కె.శ్రీనివాస రెడ్డి పూలమాలలు వేసి మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల కోసం, సంక్షేమం కోసం, యూనియన్ పటిష్టత కోసం అంబటి ఆంజనేయులు చేసిన సేవలను గుర్తు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబటి పోరాటాల స్ఫూర్తితో యూనియన్ ముందుకు సాగాలని కోరారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాకపోగా, వివిధ రూపాలలో ప్రభుత్వ వేధింపులను ఎదుర్కో వాల్సి వచ్చిందని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశాభావం పాత్రికేయుల్లో వ్యక్తమవు తోందని తెలిపారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమ యం ఇచ్చి... అప్పటికీ సమస్యలు పరిష్కారం కాని పక్షంలో పోరాటానికి సిద్ధం కావాలని తెలిపారు. పాత్రికేయులపై దాడులను నిరసిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను అణచి వేసినప్పుడు దానికి వ్యతిరేకంగా నోరు విప్పకపోగా, ప్రభుత్వ చర్యలను బలపరిచి, యూని యన్ పోరాటాలను నీరుగార్చడానికి ప్రయత్నించిన వారికి పత్రికా స్వేచ్ఛ గురించి మాట్లాడే అర్హత ఎప్పటికీ ఉండదని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టు చట్టాల్లో యాజమాన్యాలకు అనుకూలంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను ప్రతిఘటిం చాలని పిలుపునిచ్చారు. హక్కుల పరిరక్షణ కోసం వీలైన పద్ధతుల్లో పోరాటాలు సాగించాలని, సంస్థాగ తంగా యూనియన్‌ను బలోపేతం చేయాలని, త్వరలో రాష్ట్ర మహాసభ కూడా జరుపుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ఇప్పటికే మం త్రుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో ముఖ్య మంత్రిని కలిసి విన్నవిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితుల్లో కూడా సమస్యలపై యూనియన్ పోరాడిం దన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుం దర్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, డా.ఎం.ప్రసాద్, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ తదితరులు మాట్లాడారు. కొన్ని ఛానెళ్ల ప్రతినిధులను శాసనసభ కవరేజీ చేయనీయకుండా నిషేధిస్తూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నూతన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సభాపతికి కృతజ్ఞతలు తెలుపుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు రాయితీ కల్పించే ఆనవాయితీని కొనసాగించేటట్లు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. పూతల పట్టు శాసనసభ్యునిగా ఎన్నికయిన సీనియర్ పాత్రికే యుడు, ఏపీయూడబ్ల్యూజే నాయకుడు డా.కె.మురళీ మోహన్‌ను రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఘనంగా సత్కారం చేశారు. ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి సహా అనేక మంది వక్తలు మాట్లాడుతూ శాసనస భ్యునిగా డా.మురళీ మోహన్ బాగా రాణించాలని ఆకాంక్షించారు. మురళీ మోహన్ మాట్లాడుతూ తన వ్యక్తిత్వ వికాసానికి చక్కని మార్గదర్శకత్వం వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ద్వారానే లభించిందని, నిరంతరం జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని, ప్రజల మన్ననలు పొందే విధంగా తన పనితీరు ఉంటుందని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల యూనియన్ల ప్రతినిధులు డా.మురళీ మోహన్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

తెలుగు యువకుడి హత్య కేసులో

నిందితుడి అరెస్ట్

హ్యూస్టన్ (అమెరికా):
అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో ఓ కన్వీనియన్స్ స్టోర్‌లో జరిగిన దోపిడీలో తెలుగు యువకుడు (32) హత్యకు గురైన కేసులో పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎనిమిది నెలల క్రితమే అమెరికాకు వచ్చిన దాసరి గోపీకృష్ణ ఈ నెల 21న డల్లాస్‌లోని ప్లజెంట్ గ్రోవ్ లోని కన్వీనియన్స్ స్టోర్‌లో దారుణ హత్యకు గురయ్యారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా యాజలి గ్రామానికి చెందినవారు. గోపీకృష్ణను హత్య చేసిన డావోంటా మథిస్ (21) అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. దోపిడీ సమయంలో మథిస్ దుకాణంలోకి ప్రవేశించి కౌంటర్ వద్దకు వచ్చి గోపీకృష్ణను చాలాసార్లు కాల్చి చంపాడు. పారిపోయే ముందు వస్తువులను దొంగిలించాడని పోలీసులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉన్న గోపీకృష్ణను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మథిస్‌ను మొదట అరెస్టు చేసి దోపిడీ అభియోగాలు మోపారు. కానీ గోపీకృష్ణ మరణం కారణంగా ఈ అభియోగాన్ని హత్య కేసుగా పోలీసులు మార్చారు. మెస్క్విట్ పోలీసుకు చెందిన సార్జెంట్ కర్టిస్ ఫిలిప్ మాథిస్ ప్రవర్తనను చాలా విచిత్రమైనదిగా అభివర్ణించారు. ఈ నెల 20న వాకో సిటీలో జరిగిన మరో కాల్పుల కేసులో కూడా మాథిస్ పై అభియోగాలు నమోదయ్యాయి. మహమ్మద్ హుస్సేన్ (60)పై అతడు చాలాసార్లు కాల్పులు జరిపాడు. కాగా, గోపీకృష్ణ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అక్కడి భారత కాన్సులేట్ కుటుంబ సభ్యులతో సంప్రదింపులు చేస్తోంది. గోపీకృష్ణ పార్థివదేహాన్ని భారత్‌లోని ఆయన స్వగ్రామానికి తరలించడానికి వీలుగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులు, కుటుంబ సభ్యులు కాన్సులేట్ తో కలిసి పనిచేస్తున్నారు. పోలీసు శవపరీక్షలు, అవసరమైన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాయని, మంగళవారం నాటికి మృతదేహాన్ని తరలించేందుకు ప్రాధాన్యమిస్తున్నామని కాన్సులేట్ స్పష్టం చేసింది. నైట్ షిఫ్టులో పనిచేసే కన్వీనియన్స్ స్టోర్ క్లర్క్ పై దాడి జరగడం ఇది రెండోసారి. ఈ ఘటన డల్లాస్, పరిసర ప్రాంతాల్లోని భారతీయ సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. గోపికృష్ణకు భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.